సోమవారం
15-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 204
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



సెలవు

సంక్రాంతి సందర్భముగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

'స్కిల్' కేసులో రేపు తీర్పు



- 17ఏ వర్తిస్తుందంటూ చంద్రబాబు పిటిషన్
- సుదీర్ఘ వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

2లో

రక్తం చిందిన బరులు

జోరుగా కోడి పందేలు

- కోర్టు ఆదేశాలు బేఖాతరు
- నేతల అండతో చెలరేగుతున్న నిర్వాహకులు
- సినిమా సెట్టింగులను తలపిస్తున్న ఏర్పాట్లు
- రాత్రిపూట సైతం పందేలకు సిద్ధం
- రూ.కోట్లలో చేతులు మారుతున్న నగదు

2లో

అంబరాన్నంటిన భోగి సంబరాలు

తెలుగు లోగిళ్లలో భోగి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం వేకువజాము నుంచే భోగి మంటలు వేసి, బంధుమిత్రులతో కలిసి జనం సందడి చేవారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి సంప్రదాయంగా వేడుకలు జరుపుకున్నారు. రంగవల్లులతో వాకిళ్లను సుందరంగా తీర్చిదిద్దారు.

భోగి మంటల్లో 'భూ చట్టం' ప్రతులు

- దహనం చేసి నిరసన తెలిపిన రైతులు, రైతు సంఘం నాయకులు
- ప్రజా వ్యతిరేక చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్

2లో

ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతు సంఘం నాయకులు, రైతులు 'భూ చట్టం' జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయం కోసం యాత్ర

- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం
- ఫాసిస్టు శక్తులకు చెక్ పెట్టడమే ఉద్దేశం
- భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభం
- మీ మనస్సులోని మాట వినేందుకే వచ్చా: రాహుల్
- ఓట్ల కోసం తప్ప మణిపూర్ వచ్చే తీరిక మోదీకి లేదు: ఖర్గే

2లో



మన రాజధాని అమరావతే

- ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం
- టీడీపీ అధినేత చంద్రబాబు
- రాజధాని సంకల్పం నెరవేరనుంది: పవన్

2లో

కాంగ్రెస్‌కు మిలింద్ రాజీనామా

షిండే సమక్షంలో శివసేనలో చేరిక

2లో



భోగి మంటల్లో 'భూ చట్టం' ప్రతులు

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ హక్కుల యాజమాన్య చట్టం (ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023) జీవో ప్రతులను రైతు సంఘం నాయకులు, రైతులు భోగి మంటల్లో దహనం చేశారు. భూ సమస్యలను పరిష్కరించే బాధ్యతను రెవెన్యూ యంత్రాంగానికి కట్టబెట్టడం, భూ కబ్జాదారులకు అనుకూలంగా ఉండేలా చట్టం రూపొందించటాన్ని నిరసిస్తూ భూ యాజమాన్య హక్కు చట్టం జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలపాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు ఇచ్చింది. అందులో భాగంగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతు సంఘం నాయకులు, రైతులు 'భూ చట్టం' జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ చట్టం గత ఏడాది అక్టోబరు 31 నుంచి అమలులోకి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 512ను జారీ చేయడం దుర్మార్గమని రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా తుళ్లూరు గ్రామం తూర్పు వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఇప్పటికే టైటిలింగ్ చట్టంలో లోపాలను గుర్తించిన న్యాయ నిపుణులు, ప్రజా సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రజల స్థిరాస్తుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు ఆ వివాదాలను పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి రెవెన్యూ ట్రిబ్యునల్ అధికారులకు కట్టబెట్టడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. రెవెన్యూ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం భూ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు నేరుగా హైకోర్టుకు మాత్రమే అప్పీలు చేసుకునే అధికారం ఉందని పేర్కొందని, భూ సమస్యలకు కారణం రెవెన్యూ వ్యవస్థే అని అందరికీ తెలిసిందేనని, అటువంటప్పుడు వాటిని పరిష్కరించే బాధ్యతను తిరిగి ఆ రెవెన్యూ వ్యవస్థకు అప్పగించటం దొంగ చేతికి తాళాలు అప్పగించినట్లే అవుతుందన్నారు. అవినీతికి మారుపేరుగా నిలిచిన రెవెన్యూ యంత్రాంగానికి ఈ చట్టం సాధనంగా మారి భూ సమస్యను మరింత జటిలం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం అమల్లోకి వస్తే ఇప్పటివరకు భూములకు ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకం, టైటిల్ డీడ్, అడంగల్, 1బీ వంటి రికార్డులు రద్దవుతాయని చట్టంలో పేర్కొనటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించే ల్యాండ్ టైట్లిలింగ్ అధికారి నమోదు చేసే హక్కుల రిజిస్టర్‌లో భూహక్కుదారుడి పేరు తప్పుగా నమోదయితే అభ్యంతరం తెలపాలంటే జిల్లా కలెక్టర్ నియంత్రణలో జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే రెవెన్యూ ట్రిబ్యునల్‌కు వెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప సివిల్ కోర్టులను ఆశ్రయించే అవకాశం లేదన్నారు. ఇలాంటి దుర్మార్గమైన చట్టాన్ని తీసుకురావడం కబ్జాదారులు పేదల భూములను కబ్జా చేసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో భూమి తప్పుగా నమోదయిన పక్షంలో ఆ భూ యజమాని రెండు సంవత్సరాలలోపు గుర్తించి ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు చేసి తనదని నిరూపించుకోకపోతే శాశ్వతంగా భూమి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. న్యాయవాదులు కూడా ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే భూ సమగ్ర సర్వే పేరుతో జరుగుతున్న సర్వేలో అనేక అవకతవకలు ఏర్పడి స్థిరాస్తిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు రైతు సంఘం నిర్వహించిన సర్వేలో తేలిందన్నారు. సర్వే సందర్భంగా

ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమవుతుందన్నారు. స్థిరాస్తులు కలిగిన వారి హక్కులు కాపాడేందుకు ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు, వేతన కార్మికులు తదితరులు ఆందోళన చేస్తుంటే ఉద్యమాన్ని అణిచివే వేయడానికి ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం చాలా దారుణమని అన్నార. ఈ కార్యక్రమంలో జమ్ముల కిషోర్, బండారు వెంకటేశ్వరరావు, గద్దె బాబు, బండారు వేణు, కాటంనేని బాలకృష్ణ, గుమ్మశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుగుణంగా రైతు, ప్రజా వ్యతిరేక భూ హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. కేంద్ర విధానాలకు డూ..డూ.. బసవన్నలా తలూపుతూ ముఖ్యమంత్రి రైతులను, ప్రజలను ఇబ్బంది పెట్టే చట్టాన్ని సమర్థించటం దుర్మార్గ చర్య అన్నారు. ఈ ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తూ సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజలు, రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉండాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, కార్యవర్గ సభ్యులు బళ్ల కనక దుర్గారావు, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, ఎంఏ హకీమ్, నాయకులు బుగ్గల ప్రభాకర్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి, కండ్రిగూడెం శాఖ కార్యదర్శి బీకే ప్రసాద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పాల్గొని ప్రసంగిస్తూ ఈ చట్టం వల్ల పెద్ద మొత్తాల్లో భూములు చేతులు మారి ప్రభుత్వ కనుసన్నల్లో ఉండే కార్పోరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్‌దారుల వశం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు పెయ్యల వెంకటేశ్వరరావు, యువజన నాయకులు ఆర్.పృథ్వీరాజు, బత్తుల సత్యనారాయణ, బి.రాయప్ప, ఎం.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో కొటికలపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందరావు పాల్గొని మాట్లాడుతూ న్యాయ పరిజ్ఞానం లేని రెవెన్యూ అధికారులు శాశ్వత యాజమాన్య హక్కులను నిర్వహించటం జరుగుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతుల స్థిరాస్తులకు అనేక రకాల ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక చట్టాన్ని రద్దు చేసే వరకు రైతులు, రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ కోటేశ్వరరావు, యెదూరి పూర్ణచంద్రరావు, మల్నీడి గోవిందరావు, యెద్దూరి శివయ్య, రమేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి జిల్లాలో సీపీఐ జిల్లా సమితి అధ్వర్యంలో స్థానిక ఆనందనగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో భూ వివాద కేసులు పెరుగుతున్నాయని రాజ్యాంగ విరుద్ధమైన చట్టాన్ని తీసుకురావటం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, కొండవతి శ్రీనివాసరావు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తం చిందిన బరులు

విశాలాంధ్ర-అమరావతి బ్యూరో:

సంక్రాంతి సందర్భంగా ఎప్పటిలాగే కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో భోగి రోజు పెద్దఎత్తున కోడి పందేలు ప్రారంభమయ్యాయి. కోడి పందేలు నిర్వహించరాదని కోర్టు ఆదేశాలున్నప్పటికీ అధికారమే అండగా... విచ్చలవిడిగా కోడి పందేలు సాగుతున్నాయి. పందెం కోళ్ల కాళ్లకు పదునైన కత్తులు కట్టడంతో బరుల్లో రక్తం చిందింది. తొలి రోజు కోడి పందేల్లో పాల్గొనడానికి ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ప్రముఖులు తరలివచ్చారు. పార్టీలకు అతీతంగా నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా పందేలు జరుగుతున్నాయి. రూ.కోట్లలో నగదు చేతులు మారుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో తీర ప్రాంతం, మెట్ట ప్రాంతం అనే తేడా లేకుండా బరులు వెలిశాయి. గుడివాడ, పెనమలూరు, కైకలూరు, గన్నవరం, ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో జోరుగా పందేలు నిర్వహిస్తున్నారు. పంట పొలాలు, మామిడితోటలను సైతం కోడిపందేల బరులుగా మార్చేశారు. రాత్రిళ్లు సైతం పందేలు నిర్వహించేందుకు వీలుగా జనరేటర్లు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. కోడిపందేలు నిర్వహించకూడదని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పోలీసుల తనిఖీలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. సంక్రాంతి సంబరాల పేరుతో కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం అంపాపురంలో ఏటా మాదిరిగానే భారీ స్థాయిలో కోడిపందేలు, కోతముక్క, ఇతర జూద శిబిరాలు నిర్వహిస్తున్నారు. 16వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 25 ఎకరాల ప్రైవేటు స్థలంలో ప్రత్యేకంగా బరులు, వేదికలు ఏర్పాటు చేశారు. మూడురోజుల పాటు జూద శిబిరాలు కొనసాగేలా సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సీఎం జగన్‌తో స్థానిక ప్రజాప్రతినిధుల చిత్రాలతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహిళలు, వీవీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వేల సంఖ్యలో వచ్చే జూదరుల కోసం విశాలమైన పార్కింగ్ స్థలాన్ని అందుబాటులోకి తెచ్చారు. సినిమా సెట్టింగ్‌లను తలపించేలా స్వాగత ద్వారాలు, బౌన్సర్లు, సందర్శకులకు పాస్‌లు, ఆటగాళ్లకు టోకెన్లు, చేతి కంకణాల వంటి ఏర్పాట్లతో హంగామా చేశారు. పందేల మొదటి రోజే రూ.లక్షల్లో నగదు చేతులు మారుతోంది. పందేలను తిలకించేందుకు వస్తున్న వాహనదారులతో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారితో పాటు సర్వీసు రోడ్లపై విపరీతంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఇక ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలో జోరుగా కోడిపందేలు సాగుతున్నాయి. ఉదయం నుంచే అనేక చోట్ల పందెం రాయుళ్లు బరిలో దిగారు. ఆకివీడు, నిడమర్రు, ఉండి, భీమవరం, జంగారెడ్డిగూడెం మండలాల్లో తొలి రోజు నుంచే పెద్ద మొత్తాల్లో నగదు చేతులు మారుతోంది. ఉండి, కాళ్ల మండలంలో కోడి పందేల కోసం ప్రత్యేక మైదానం ఏర్పాటు చేశారు. క్రికెట్ మైదానంలా కోడిపందేల వీక్షణకు ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు. పెదఅమిరం, సీసలి, ఆకివీడులో రాష్ట్రస్థాయి పందేలు జరుగుతున్నాయి. ఉండి, మహదేవపట్నంలో బరుల వద్ద ఫ్లడ్‌లైట్లు, పందేలను వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. తెలంగాణ, కర్ణాటక మహారాష్ట్ర, ఒడిశాతో పాటు రాయలసీమ ప్రాంతం నుంచి వందల సంఖ్యలో కార్లలో పందెం రాయుళ్లు తరలివచ్చారు.

'స్కిల్' కేసులో రేపు తీర్పు

న్యూఢిల్లీ: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టు సక్రమమో, అక్రమమో తేలిపోనుంది. ఈ కేసులో తనపై దాఖలయిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడానికి నిరాకరించిన హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు జనవరి 16వ తేదీ మంగళవారం తీర్పు వెలువరించ నుంది. 2015లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం చేయడం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.371 కోట్ల మేర నష్టం వాటిల్లేలా చేశారని ఆరోపిసూ గత ఏడాది సెప్టెంబరు 9న చంద్రబాబును అరెస్టు చేశారు. అయితే ఈ ఆరోపణలను చంద్రబాబు ఖండించారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత ఏడాది నవంబరు 20న ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. తనపై ఉన్న ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేందుకు 2023 సెప్టెంబరు 22న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేల ఎం త్రివేదితో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం గత ఏడాది అక్టోబరు 17న తీర్పును రిజర్వ్ చేసింది. సుప్రీం కోర్టులో పిటిషన్‌పై విచారణ సందర్భంగా అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ వర్తింపు గురించి ప్రశ్న తలెత్తదని, ఎందుకంటే ఈ నిబంధన జులై 2018 నుంచి అమలులోకి వచ్చినందున తనపై దాఖలయిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ చంద్రబాబు వేసిన పిటిషన్‌ను తిరస్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది వాదించారు. అయితే 2017లో సీబీఐ విచారణ ప్రారంభించింది. జులై 26, 2018 నుంచి అమలులోకి వచ్చే సవరణ ద్వారా సెక్షన్ 17ఎను ప్రవేశపెట్టారు. అవినీతి నిరోధక చట్టం కింద ప్రభుత్వ సేవకుడిని ఏదైనా విచారణ లేదా దర్యాప్తు చేసేందుకు పోలీసు అధికారి ముందస్తు అనుమతిని పొందాలని ఈ నిబంధన నిర్దేశిస్తుంది. ఎఫ్ఐఆర్‌లోని ఆరోపణలన్నీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన నిర్ణయాలు, సూచనలు లేదా సిఫార్సులకు సంబంధించినవని, డిసెంబరు 2021లో విచారణ ప్రారంభమైనందున ఈ కేసులో సెక్షన్ 17ఎ వర్తిస్తుందని చంద్రబాబు నాయుడు తరపు న్యాయవాదులు వాదించారు. ఈ కుంభకోణం కేసులో సమర్థమైన అధికారం నుంచి ముందస్తు అనుమతి పొందకుండానే తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, అందుకే తన అరెస్టు చట్ట విరుద్ధమని టీడీపీ అధినేత వాదించారు. ఈ కుంభకోణానికి సంబంధించి తనపై ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ తాను వేసిన పిటిషన్‌ను కొట్టివేసిన ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ, ప్రాథమిక దశలో నేర విచారణను అడ్డుకోకూడదని, ఎఫ్ఐఆర్‌ని రద్దు చేయడం అనేది నియమం కాకుండా మినహాయింపుగా ఉండాలని పేర్కొంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో 52 రోజులున్నారు. ఆ తరువాత తొలుత మధ్యంతర బెయిల్‌పై అనంతరం పూర్తి స్థాయి బెయిల్‌తో విడుదలై బయట ఉన్నారు. సెక్షన్ 409 అవినీతి కేసులో అరెస్ట్ అయిన చంద్రబాబు సెక్షన్ 17ఎ ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోనందున తన అరెస్టు అక్రమమని, కేసు కొట్టివేయాలని ముందుగా ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఆ తరువాత ఏపీ హైకోర్టుకు వెళ్లారు. సెప్టెంబరు 22న హైకోర్టు కూడా చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటీషన్ కేసును కొట్టివేసింది. దాంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం ఈ కేసుపై సుదీర్ఘంగా విచారించింది. సెక్షన్ 17ఎ చంద్రబాబు అరెస్ట్ అయిన కేసుకు వర్తిస్తుందా లేదా అనే అంశంపైనే ప్రధానంగా వాదనలు జరిగాయి. సుప్రీం కోర్టుకు చెందిన ప్రముఖ న్యాయవాదులు రెండు పక్షాల నుంచి వాదనలు వినిపించారు. దీపావళికి ముందే ఈ కేసులో విచారణ ముగిసింది. సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది.

తొలుత నవంబరు 8న తీర్పు వెలువడుతుందని ఆశించినా ఆ తరువాత వాయిదా పడుతూ వచ్చింది. ఈ తీర్పు చంద్రబాబు భవితవ్యాన్ని నిర్ణయించనుంది. ఒకవేళ తీర్పు చంద్రబాబుకు వ్యతిరేకంగా వస్తే ఆ ప్రభావం ఈ కేసులో హైకోర్టు జారీ చేసిన బెయిల్‌పై కూడా ప్రభావం చూపించవచ్చు.

న్యాయం కోసం యాత్ర

ఇంఫాల్:

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ఫాసిస్టు, మతశక్తులను కట్టడి చేసేందుకు భారత్ జోడో న్యాయ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. శాంతి కోసం పోరాటం కొనసాగిస్తామని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీకి, బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు మణిపూర్... మన దేశంలో భాగంగా కనిపించడం లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. హింసతో ఇబ్బందులు పడిన మణిపూర్ ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు ప్రధాని ఇప్పటివరకు రాష్ట్రానికి రాకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. మణిపూర్‌లోని తౌబల్ జిల్లా ఖోంగ్‌జోమ్ నుంచి భారత్ జోడో న్యాయ యాత్రను జాతీయ జెండా ఊపి ఖర్గే ప్రారంభించారు.ఆ జెండాను రాహుల్‌కు అందజేశారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో ఇంఫాల్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్‌కు కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన నేరుగా 'ఖోంగ్‌జోమ్ యుద్ధ స్మారకం' వద్దకు చేరుకొని 1891 ఆంగ్లో- మణిపూర్ యుద్ధ సార్మకం వద్ద అమరులకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం 'న్యాయ్ మైదాన్' చేరుకొని బహిరంగ సభలో మాట్లాడారు.

శాంతి పునరుద్ధరిస్తాం

'న్యాయం' కోసమే ఈ న్యాయ యాత్ర అని రాహుల్ గాంధీ తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అన్యాయాలను తిప్పికొట్టడమే ఉద్దేశమని, ప్రజల మనసుల్లోని మాటలు, వారి సమస్యలు వినేందుకే వచ్చానన్నారు. మీ బాధ పంచుకోవడం, సౌభ్రాతృత్వం, సామరస్యతను మీతో పంచుకోవాలని కోరుకుంటున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. మీ బాధ, ఆవేదనను అర్థం చేసుకోగలనని మణిపూర్ ప్రజలనుద్దేశించి అన్నారు. మణిపూర్ అన్నది భారత్‌లో భాగం కాదన్న తరహాలో మోదీ, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి ఉందని విమర్శించారు. లక్షలాదిమంది సర్వం కోల్పోయి బాధలో ఉంటే కనీసం వారి కన్నీళ్లు తుడిచేందుకు, దగ్గరకు తీసుకొని ఓదార్చేందుకు ప్రధాని రాకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. శాంతి, సామరస్యత పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రేమానురాగాలకు మణిపూర్ ప్రతీకని, ఆ పరిస్థితిని కాంగ్రెస్ ద్వారా మళ్లీ చూస్తారని రాహుల్ ఉద్ఘాటించారు.

'గతేడాది జూన్ 29న మణిపూర్‌కు వచ్చా. ఇక్కడి పరిస్థితులను నేను గతంలో ఎన్నడూ చూడలేదు, వినలేదు. 2004 నుంచి రాజకీయాల్లో ఉన్నా...కానీ రాష్ట్రంలో పాలన కుప్పకూలడం మొదటిసారి చూశా. మణిపూర్ విద్వేషాలతో విభజించబడింది. లక్షల మంది సర్వం కోల్పోయారు. కళ్ల ఎదుటే తమ కుటుంబ సభ్యుల ఊచకోతను చూశారు. కానీ మోదీ మనస్సు చలించలేదు. మణిపూర్‌ను ఓదార్చేందుకు రాలేదు.

మణిపూర్ ఈ దేశంలో భాగం కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆయనకు మీ బాధ పట్టడం లేదు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పెంచిపోషించిన సిద్ధాంతాలకు, విద్వేష రాజకీయాలకు మణిపూర్ సాక్షిగా నిలిచింది. రాష్ట్రంలో శాంతిని తిరిగి నెలకొల్పుతామని కాంగ్రెస్ హామీనిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

మోదీ వచ్చేది ఓట్ల కోసమే: ఖర్గే

మతాన్ని, రాజకీయాలను కలిపి ప్రజలను రెచ్చగొట్టడమే బీజేపీ పని అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కేవలం ఓట్ల కోసమే మోదీ వస్తారని... ఇక్కడి ప్రజల వెతలు తెలుసుకునేందుకు, వాటిని తీర్చేందుకు కాదని దుయ్యబట్టారు. సముద్రంలో ఈత కొడుతూ సరదగా గడపటానికి మోదీకి సమయం ఉంది కానీ మణిపూర్ వచ్చే తీరిక మాత్రం ఆయనకు దొరకలేదని ఎద్దేవా చేశారు. మోదీ కేవలం ఓట్ల కోసం రామనామం జపిస్తున్నారని, మరోవైపు జేబులో కత్తి పెట్టుకొని తిరుగుతున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం, లౌకికవాదం, సమానత్వం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ఫాసిస్టు, మతశక్తులపై పోరుకు రాహుల్ న్యాయ యాత్ర చేపట్టారని ఖర్గే తెలిపారు. శాంతి సందేశమిచ్చేందుకు తమ పార్టీ అగ్రనాయకుడు ఇంటింటికీ వెళుతుండటం గర్వంగా ఉందన్నారు. 'మనది సుదూర ప్రయాణం. ఇలాంటి యాత్ర గతంలో జరగలేదు. భవిష్యత్‌లోనూ జరగబోదు' అని ఖర్గే అన్నారు.

కొయిరెంజి బజార్ వరకు యాత్ర

మణిపూర్ నుంచి ముంబై వరకు కాంగ్రెస్ నేతలు ప్రయాణించే న్యాయ యాత్ర బస్సును ఖర్గే ఆవిష్కరించారు. భారత్ జోడో న్యాయ యాత్ర ఆదివారం మధ్యాహ్నం బహిరంగ సభ ప్రాంగణం నుంచి మొదలై... సాయంత్రానికి కొయిరెంజి బజార్ చేరుకుంది. రాత్రికి సెక్మాయిలోని కౌంజెంగ్లెమా స్పోర్ట్స్ అసోసియేషన్ ఫుట్‌బాల్ మైదానంలో రాహుల్‌తో పాటు యాత్రికులు బస చేస్తారు.

ఈ యాత్ర 67 రోజులు...110 జిల్లాల మీదుగా 6,700 కిమీలు సాగబోతోంది. ఎన్నికల ముందు నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది. తొలుత యాత్ర నిర్వహణకు మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం అంగీకరించలేదు. తర్వాత ఇంఫాల్‌కు 35కిమీల దూరంలోని ప్రైవేటు మైదానంలో సభ నిర్వహణ, అక్కడ నుంచి యాత్ర ప్రారంభానికి షరతులతో కూడిన అనుమతులు ఇచ్చింది.

కాంగ్రెస్‌కు మిలింద్ రాజీనామా

ముంబై : రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభం రోజు కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర మాజీ మంత్రి, మహారాష్ట్రలో పార్టీ సీనియర్ నేత మిలింద్ దేవరా ఆ పార్టీకి షాకిచ్చారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఆయన ఆదివారం రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం గల కాంగ్రెస్‌ను విడిచిపెట్టిన కొన్ని గంటల తర్వాత మిలింద్ దేవరా ముంబైలో జరిగిన ఓ బహిరంగ సభలో ఏక్‌నాథ్ షిండే సమక్షంలో శివసేనలో చేరారు. షిండే... దేవరాకు కాషాయ జెండా అందించడం ద్వారా పార్టీలో చేర్చుకున్నారు. కాగా, మిలింద్ దేవరా కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాను ధ్రువీకరించారు. ఇది తన రాజకీయ ప్రయాణంలో 'ముఖ్యమైన అధ్యాయానికి ముగింపు' అని పేర్కొన్నారు. 'ఈ రోజు నా రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసింది. నేను కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాను. పార్టీతో నా కుటుంబానికి గల 55 ఏళ్ల బంధానికి ముగింపు పలికాను. నాకు సంవత్సరాలుగా మద్దతు ఇచ్చిన నాయకులు, సహచరులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు' అని దేవరా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రముఖ దక్షిణ ముంబై లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ కేంద్ర మంత్రి, రెండుసార్లు ఎంపీ అయిన దేవరా నిష్క్రమణ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఈ పరిణామం సార్వత్రిక ఎన్నికలకు నెలల ముందు... కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభించిన రోజున జరిగింది. కాగా, 2014 వరకు ఆయన ప్రాతినిధ్యం వహించిన ముంబై దక్షిణ పార్లమెంట్ సీటుపై నెలకొన్న సందిగ్ధతే పార్టీ వీడటానికి కారణంగా తెలుస్తున్నది. రానున్న ఎన్నికల్లో ముంబై దక్షిణ ఎంపీ స్థానం నుంచి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. దీంతో పొత్తులో భాగంగా తనకు పోటీచేసే అవకాశం లభించదని భావించిన దేవరా... పార్టీ వీడుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఈ సీటుకు ఠాక్రే విధేయుడైన అరవింద్ సావంత్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ఈ నియోజకవర్గంలో దేవరాను ఓడించారు. 47 ఏళ్ల దేవరాను షిండే సేన తన అభ్యర్థిగా బరిలోకి దించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా, దేవరాను గత నెలలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సంయుక్త కోశాధికారిగా కాంగ్రెస్ నియమించింది. తనకు సంస్థాగత బాధ్యతలు అప్పగించినందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ దివంగత నేత మురళీ దేవరా కుమారుడు మిలింద్ దేవరా. ఆయన లోక్‌సభకు తొలిసారిగా 2004లో ముంబై దక్షిణ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2011లో కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2012లో అదనంగా షిప్పింగ్ శాఖను అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అప్పగించారు.

ప్రధాని 'శీర్షిక నిర్వహణ' మంత్రాంగం: జైరాం రమేశ్

భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభానికి కొద్ది సేపటి ముందే మిలింద్ దేవరా రాజీనామా చేయడం తమ యాత్రపై ఎలాంటి ప్రభావం చూపబోదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నుంచి దేవరా నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించే సమయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయించారని ఆరోపించారు. జైరాం రమేశ్ పీటీఐతో మాట్లాడుతూ మిలింద్ దేవరా వెళ్లిపోయారని, అయితే తమ పార్టీ, భావజాలాన్ని నమ్మే లక్షల మంది మిలింద్‌లు అలాగే ఉన్నారని అన్నారు. శుక్రవారం దేవరా తనతో ఫోన్‌లో మాట్లాడారని, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) దక్షిణ ముంబై లోక్‌సభ సీటు నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించడంతో రాహుల్ గాంధీతో మాట్లాడాలని అభ్యర్థించారని చెప్పారు. 'ఇదంతా ఒక ప్రహసనం మాత్రమే. వెళ్లిపోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఆయన నిష్క్రమణ ప్రకటన సమయాన్ని ప్రధాన మంత్రి స్పష్టంగా నిర్ణయించారు' అని జైరాం రమేశ్ ఆరోపించారు.

దేవరా ప్రకటన సమయాన్ని ఎత్తి చూపుతూ ఇది ప్రధానమంత్రి నిర్ణయించిందని, దేవరా 'కేవలం కీలుబొమ్మ' అని విమర్శించారు. 'భారత్ జోడో న్యాయ యాత్ర అన్ని వార్తాపత్రికలు, టీవీల్లో ప్రతిచోటా ఉంది. అందువల్ల మోదీ 'ప్రధాన శీర్షిక నిర్వహణ' కోసం 'మిలింద్ దేవరా కాంగ్రెస్‌ను విడిచిపెట్టాడు' అని ప్రధాన శీర్షిక ఇచ్చారు? కానీ దీని ప్రభావం ఉండదు' అని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ మురళీ దేవరాతో తన సుదీర్ఘ అనుబంధాన్ని ఎంతో అభిమానంతో గుర్తు చేసుకున్నారు.

మన రాజధాని అమరావతే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మన రాజధాని అమరావతేనని, ఇది ఆంధ్ర ప్రదేశ్‌ను సస్యశ్యామలం చేస్తుందని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంపద సృష్టించే కేంద్రంగా, సంక్షేమ పాలన అందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. రాజధాని పరిధిలోని మందడంలో నిర్వహించిన తెలుగు జాతికి స్వర్ణయుగం-సంక్రాంతి సంకల్పం కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. తెలుగుదేశం-జనసేన పార్టీల అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఉత్తర్వులు, అమరావతి వ్యతిరేక ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ వైసీపీ అసమర్థ, విధ్వంస విధానాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. అమరావతి రైతులు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ ఐదేళ్లు వారికి చీకటి రోజులన్నారు. ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయన్నారు. ఇవాళ పండుగేమో భోగి, పాలకుడేమో మానసిక రోగి అని వ్యాఖ్యానించారు. శుభగడియలు తలుపు తడుతున్నాయని, వైసీపీ విముక్త ఆంధ్ర ప్రదేశ్ కోసం 87 రోజులపాటు కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరూ ఒకే బాటలో పయనించాలని కోరారు. అమరావతి రాజధానితోనే ఆంధ్ర ప్రదేశ్ సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. సంపద సృష్టించే కేంద్రంగా, సంక్షేమ పాలన అందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. జగన్‌కు కూల్చడమే తెలుసు అని, నిర్మించడం తెలియదన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి రైతులు పోరాడారని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాలని, రాజకీయ హింస, మోసపు హామీలతో జగన్ బడుగు, బలహీనవర్గాల ఉసురు తీస్తున్నారని దుయ్యబట్టారు. 32 రోజులుగా అంగన్‌వాడీలు ఉద్యమిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని తెలిపారు.

పండగ పూట వారిని రోడ్డుపై ఉండేలా చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో రైతులు చాలా కష్టాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, తుపాను వచ్చి నష్టపోయినా వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని, భవిష్యత్‌లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే బాధ్యతను టీడీపీ, జనసేన తీసుకుంటాయని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాజధాని రైతుల సంకల్పం నెరవేరబోతుందన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రానికి పట్టిన పీడ తొలగిపోయే సమయం ఆసన్నమైందని చెప్పారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని రైతులను దారుణంగా కొట్టి వేధించిన ఘటన నన్ను కలచివేసిందన్నారు. బంగారు రాజధానిని నిర్మించుకుందామని, ఇది కేవలం అమరావతి సమస్య కాదని, ఐదు కోట్ల మంది ప్రజలందని చెప్పారు.

భవన నిర్మాణ కార్మికులు, నిరుద్యోగులనూ వైసీపీ ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, అమరావతి రాజధాని జేఏసీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణ అవస్థ

- పండుగ వేళ బస్టాండ్లు కిటకిట
- సరిపడా బస్సుల్లేక ఇక్కట్లు

విశాలాంధ్ర-విజయవాడ: సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని బస్టాండ్లు కిటకిట లాడుతున్నాయి. ముఖ్యంగా విజయవాడలోని పండిత్ నెహ్రూ బస్టాండ్ రద్దీగా మారింది. దూరప్రాంతాల సొంతూళ్లకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున ప్రయాణికులు రావడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రత్యేకించి మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణాలోని హైదరాబాద్ సహా కర్నాటకలోని బెంగళూరు, మహారాష్ట్రలోని ముంబై, పూణే తదితర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో వచ్చిన ప్రయాణికులు తదుపరి మజిలీ కోసం విజయవాడలో దిగుతున్నారు. దీంతో పండిట్ నెహ్రూ బస్టాండ్ ప్రయాణికులతో నిండిపోయింది. ఆర్టీసీ అధికారులు సమీప ప్రాంతాల సర్వీసులను రద్దు చేసి దూర ప్రాంతాలకు బస్సులు నడపటంతో మచిలీపట్నం, గుడివాడ, ఏలూరు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు బస్సుల కొరత ఏర్పడింది. దీంతో ఆ ప్రాంత ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల నుంచి అవస్థలు పడి విజయవాడ చేరుకున్న ప్రయాణికులకు ఇక్కడ గంటల కొద్దీ బస్సు సర్వీసులు అందుబాటులో లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విశాఖ, శ్రీకాకుళం, తిరుపతి, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన దూరప్రాంత సర్వీసులకు రిజర్వేషన్ కారణంగా సీట్లు అందుబాటులో లేకపోవటంతో అధికారులు తాత్కాలికంగా అదనంగా ఎక్స్ ప్రెస్ బస్సులు మాత్రమే ఏర్పాటు చేశారు. నాన్ స్టాప్ బస్సులు తిరిగే గుడివాడ, మచిలీపట్నం, గుంటూరు, ఏలూరు తదితర ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సులు ఏర్పాటు చేసి ఆర్టీసీ మమ అనిపించింది. వాటినైనా సమయానికి ఏర్పాటు చేయకపోవటంతో పండిట్ నెహ్రూ బస్టాండ్ రద్దీగా మారింది. ఆర్టీసీ బస్సులు లేకపోవటంతో చాలా మంది ప్రయాణికులు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. మరోవైపు హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన బస్సు సర్వీసులన్నీ ఖాళీగానే ఉండిపోయాయి.

విశాఖలో...

ప్రయాణికుల రద్దీతో విశాఖ ద్వారక బస్ కాంప్లెక్స్ కిటకిటలాడుతోంది. విశాఖ నుంచి గ్రామాలకు వెళ్లే వారితో బస్టాండ్ ప్రాంగణం నిండిపోయింది. విశాఖ నుంచి ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారు. పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, హైటెక్ ఏసీ బస్సులు పూర్తి ప్రయా ణికుల సామర్థ్యంతో నడుస్తున్నాయి. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని.. విశాఖ ఆర్టీసీ అధికారులు దూర ప్రాంతాలకు 110 కి పైగా అదనపు సర్వీసులు నడుపుతున్నారు. జిల్లా, సమీప జిల్లా పరిధిలోని ప్రదేశా లకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఎప్పటికప్పుడు నడుపుతు న్నారు... విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్, మద్దిలపాలెం బస్ స్టేషన్ ప్రయాణికులతో నిండి పోయాయి.

సీఎం ఇంట సంక్రాంతి సంబరాలు

- జగన్, భారతి దంపతుల హాజరు
- అలరించిన కళా ప్రదర్శనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ... వాడా... సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి మన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. పల్లెల నుంచి పట్టణాల వరకు ముత్యాల ముగ్గులు వేసి పండుగను స్వాగతించారు. తాడేపల్లి క్యాంపు కార్యాల యంలోని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇంట ఈ వేడుకలను అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. సీఎం వైఎస్ జగన్, భారతి దంపతులు సంప్రదాయ దుస్తుల్లో భోగి మంటలు వేయడంతో పండుగ సంబరాలను ప్రారంభించారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పర్యవేక్షణలో ఈ సంబరాలను నిర్వహించారు. అనంతరం బసవన్నలకు సారెను సమర్పించి, గోపూజ కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు కొట్టు సత్యనారాయణ, నారాయణ స్వామి, మంత్రి ఆదిమూలపు సురేశ్, వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు హాజరయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వైసీపీ అధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హుషారుగా చిందులు వేశారు. ఇది సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున వైరల్ అయ్యింది. సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

డిమాండ్లు పరిష్కరించే వరకూ ఉద్యమం: రవీంద్రనాథ్

విశాలాంధ్ర-మార్కాపురం: న్యాయ సమ్మతమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 34 రోజుల నుండి అంగన్‌వాడీలు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా ప్రతులను రవీంద్రనాథ్ అధ్వర్యంలో ఆదివారం ఇక్కడ భోగి మంటల్లో దహనం చేశారు. అనంతరం జరిగిన సభలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తానని పదేపదే చెప్పిన జగన్...అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. చాలీచాలని వేతనాలతో... రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో అంగన్‌వాడీ సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం నుండి ఒత్తిడి వచ్చినప్పటికీ వెనకడుగు వేయకుండా అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొనడం హర్షణీయమన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఉద్యమం కొనసాగించాలని అంగన్‌వాడీలను రవీంద్రనాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందే నాసరయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాసిం, సీపీఎం పట్టణ కార్యదర్శి డి. సోమయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు బి.శ్రీరాములు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్యాన్సులతో అదరగొట్టిన మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: రాష్ట్రంలో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు తెల్లవారుజామునే లేచి భోగి మంటలు వేశారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో భోగి వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. డ్యాన్సులు వేసి సందడి చేశారు. ఈ వేడుకలకు భారీ సంఖ్యలో సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ, సంక్రాంతి కోసం ప్రత్యేకంగా తన పేరుతో పాటలు రాయించానని తెలిపారు. "గతంలో డ్యాన్స్ వేస్తే సంబరాలు రాంబాబు అని విమర్శించారు. అందుకే సంబరాలు రాంబాబు అనే పేరుతో పాట రాయించాను. సంక్రాంతి వస్తే నేను సంబరాలు రాంబాబునే. సంక్రాంతి ముగిసిన తర్వాత అసలైన రాజకీయ నాయకుడిని.. టీడీపీ, జనసేన ఆనైతికంగా పొత్తును కుదుర్చుకున్నాయి. ప్రజలు ఆ రెండు పార్టీలను భోగిమంటల్లో వేసి తగలపెడతారు" అంటూ అంబటి వ్యాఖ్యానించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నాని నివాసంలో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. భోగి వేడుకల్లో మాజీ మంత్రి పేర్ని నాని, మచిలీపట్నం వైసీపీ ఇంఛార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) పాల్గొన్నారు. విజయవాడలోని క్రీస్తు రాజపురం 5వ డివిజన్ లో భోగి సంబరాల్లో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, కార్పొరేటర్లు , వైసీపీ నాయకులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ రిక్షా సెంటర్ లో తెల్లవారుజామున నిర్వహించిన భోగి వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి సిద్ధం

నిరుద్యోగులకు శుభవార్త

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని నిరుద్యోగులకు సీఎం జగన్ సర్కారు మరో శుభవార్త తెలపనుంది. సంక్రాంతి తర్వాత మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్లను విడుదల చేశారు. నిరుద్యోగులు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకిగాను డీఎస్సీ ప్రకటనకు సిద్ధమైంది. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించిన విషయం విదితమే. దీనికి సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దాదాపు నాలుగున్నరేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడంతో ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నాడు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి ఏటా 10 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామని జగన్ ప్రకటించిన విషయం విదితమే. అప్పటి నుంచి ఉపాధ్యాయ నియామకాలను చేపట్టలేదు. ఇటీవల డీఎస్సీ ప్రకటించాలని విద్యార్థి, యువజన సంఘాలు ప్రభుత్వంపై పెద్దఎత్తున ఒత్తిడి చేస్తున్నారు. మంత్రి బొత్స కార్యాలయం దగ్గర విద్యార్థి, యువజన సంఘాలు నిరసనకు దిగారు. ఎట్టకేలకు జగన్ సర్కారు జంబో డీఎస్సీ నోటిఫికేషన్‌కు సిద్ధమైంది. ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య, అభ్యర్థుల వయోపరిమితి తదితర అంశాలపై త్వరలో స్పష్టత రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 30 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నట్లు సమాచారం. నోటిఫికేషన్ విడుదలైన 45 రోజుల్లోగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. టెట్, డీఎస్సీ కలిపి ఒకేసారి పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది.

అమెరికాలో ఇద్దరు తెలుగు యువకుల మృతి

ఫుడ్ పాయిజన్ కారణమనే అనుమానం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉన్నత చదువుల కోసం కోటి ఆశలతో అమెరికాకు వెళ్లిన ఇద్దరు తెలుగు యువకులు అక్కడే ఆకస్మికంగా మరణించారు. వారు అద్దెకు ఉంటున్న ఇంటిలోనే విగతజీవులుగా పడిఉండటం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే వారి మరణానికి వారు ఆర్డర్ చేసి తిన్న ఆహారమే కారణమే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల ప్రకారం వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన గట్టు వెంకన్న కుమారుడు గట్టు దినేశ్ ఎంఎస్ చేయడానికి అమెరికా వెళ్లాడు. పదహారు రోజుల క్రితం వెంకన్న కుటుంబంతో సహా విమానాశ్రయానికి వెళ్లి కుమారుడికి వీడ్కోలు తెలిపాడు. ఇంతలోనే దినేశ్ చనిపోయాడంటూ అమెరికా పోలీసుల నుంచి సమాచారం అందింది. దినేశ్‌తో అదే గదిలో ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన మరో విద్యార్థి కూడా మరణించాడని, శ్రీకాకుళంలోని వారి బంధువులకూ సమాచారం పంపారు. ఈ ఇద్దరూ నిద్రలో ఉండగానే కన్నుమూశారని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించారు. పోస్ట్‌మార్టమ్ అనంతరమే మరణానికి కారణాలు వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. త్వరలోనే వారి మృతదేహాలను భారత్‌కు పంపుతామని తెలిపారు.

రహదారులు రక్తసిక్తం

మూడు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: రాష్ట్రంలో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఇంటి ముందు ముగ్గులు వేస్తుండగా లారీ ఢీకొని ఓ యువతి మృతి చెందింది. మరో ఘటనలో పెట్రోల్ కోసం వెళ్లి వస్తుండగా బైక్ ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు యవకులు మృతి చెందగా, తిరుపతి జిల్లాలో డివైడర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యవకులు ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే... ఏలూరు జిల్లా మండవల్లి మండలం కానుకొల్లులో సంక్రాంతికి ఇంటిముందు ముగ్గులు వేస్తుండగా, అక్కాచెల్లెళ్ల మీదకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పంగిళ్ల నాగబాబు ఇద్దరు కుమార్తెలు తమ ఇంటి ముందు సంక్రాంతి ముగ్గులు వేస్తున్నారు. అదే సమయంలో కైకలూరు వైపు వెళ్తున్న ఇటుకల లారీ వారిద్దరిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద ఘటనలో తేజస్విని (16) మృతి చెందగా, పల్లవీ దుర్గకు (18) తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారు గుడివాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దుర్గకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను ప్రకాశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తేజస్విని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. తేజస్విని, పల్లవీ దుర్గ ఇంటర్ చదువుతున్నారు.

పెట్రోల్ కోసం వెళ్లి ఇద్దరి మృతి

కృష్ణాజిల్లా పామర్రు మండలం కురుమద్దాలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తానేటి హరీష్, పంది గోవింద్ మృతి చెందారు. పెట్రోల్ బంక్ నుంచి బైక్ కు పెట్రోల్ కొట్టించుకొని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. యువకుల మరణ వార్త విని కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసిన పామర్రు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం కలగుంట వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. మృతి చెందిన యువకులు శనివారం రాత్రి నాయుడుపేటలో భోగి మంటల వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బైక్ పై పాండిచ్చేరి వెళ్లేందుకు బయల్దేరారు. మార్గం మధ్యంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ఘటన ప్రదేశంలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాలను నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. విగతజీవులుగా పడి ఉన్న తమ బిడ్డలను చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

వయోపరిమితి 45 ఏళ్లకు పెంచండి

సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీపీఎస్సీ ప్రకటించిన అన్ని ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామంటూ ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు, యువతకు ఇచ్చిన మాట నీటిమూటగానే మిగిలిందని రామకృష్ణ విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారని, ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత నాలుగున్నరేళ్లుగా ఎదురుచేసిందని గుర్తుచేశారు. ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకోవడం నిరుద్యోగ యువతకేకాక వారి తల్లిదండ్రులకు కూడా భారంగా మారిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు గరిష్ట వయోపరిమితి 45 ఏళ్లకు అవకాశం ఇచ్చి.... గ్రూప్-1, గ్రూప్-2, జేఎల్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు 42 సంవత్సరాలుగా నిర్ణయించడం దారుణమని రామకృష్ణ తెలిపారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూసిన నిరుద్యోగులకు వయోపరిమితి దాటిపోయి ఆందోళన చెందుతు న్నారని, వారి ఆశలు అడియాశలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీ ప్రకటించిన ఉద్యోగాలన్నింటికీ అభ్యర్థుల వయోపరి మితిని 45 సంవత్సరాలకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రామకృష్ణను విమర్శించే అర్హత మీకుందా?

తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై జాఫర్ మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణను విమర్శించే అర్హత రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి లేదని సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జునతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం రూరల్ పరిధిలోని జగనన్న కాలనీలో పనిచేస్తున్న 9 మంది బెంగాల్ కూలీలను కిడ్నాప్ చేసి చట్టాన్ని ఉల్లంఘించినట్లు ఆ రాష్ట్ర ఎంపీ అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీకి లేఖ రాశారని, దీంతో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి దౌర్జన్యాలు మరోసారి బహిర్గతమయ్యాయని జాఫర్ దుయ్యబట్టారు. ఆ కూలీలను రక్షించాల్సిన పోలీసులు ఎమ్మెల్యే అనుచరులుగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంపై న్యాయవిచారణ జరపాలని రామకృష్ణ బహిరంగంగా డీజీపీని కోరారన్నారు. ప్రకాశ్‌రెడ్డి తనను డబ్బు డిమాండ్ చేశాడని, ఇవ్వకపోవడంతో కూలీలను పోలీసుల సహకారంతో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్బంధించారని కాలనీ కాంట్రాక్టర్ వాపోయినట్లు జాఫర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే రామకృష్ణను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదన్నారు. రామకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి జిల్లాలో ఎక్కడున్నారో గుర్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా రామకృష్ణ తోపుదుర్తి గ్రామానికి బీటీ రోడ్డు వేశారని, వేలాదిమంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించారని గుర్తు చేశారు. పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ఉన్న 49 చెరువులకు నీళ్లు తెచ్చిన ఘనత రామకృష్ణదేనని చెప్పారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 10 టీఎంసీల నీటి కోసం పోరాటం చేసి...రామకృష్ణ జైలుకు వెళ్లారని, ఆ ఉద్యమ ఫలితంగా అప్పటి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. రాప్తాడు నియోజకవర్గ ప్రజల కోసం మీరేమి చేశారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలను తిడితే పదవులు ఇస్తారని, టికెట్ వస్తుందని ప్రకాశ్‌రెడ్డి సీపీఐని విమర్శించడం తగదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రామకృష్ణ, లింగమయ్య, నారాయణస్వామి, కేశవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ గౌడ్, రైతు సంఘం నాయకులు వన్నారెడ్డి, పోతులయ్య, అల్లిపీర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జెండాలు జతకట్టడమే టీడీపీ ఎజెండా

ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాసంక్షేమాన్ని విస్మరించి స్వార్థ ప్రయోజనాల కోసం అధికారమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్న టీడీపీది జెండాలు జతకట్టడమే ప్రధాన ఎజెండా అని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా ఆదివారం వివిధ అంశాలను ఆయన వెల్లడించారు. ప్రతి ఇంటికీ సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా జనం గుండెల్లో చోటు సంపాదించడమే ఏకైక ఎజెండాగా సీఎం జగన్ శ్రమిస్తున్నారని వివరించారు.

గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ వంటి విప్లవాత్మక పాలన సంస్కరణలు చేపట్టి సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ప్రజల గుమ్మం వద్దనే అందించి ఇంటివద్దకే ప్రభుత్వాన్ని తెచ్చిన ఘనత సీఎం జగన్ దేనని విజయసాయిరెడ్డి అన్నారు. సంక్షేమ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన జగన్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. గ్రామ స్వరాజ్యం, ఇంటివద్దకే ప్రభుత్వం, క్షేత్ర స్థాయి అభివృద్ధి పేరు ఏదైనా రూపం మాత్రం ఒకటేనని స్పష్టం చేశారు.

జనసేన నుంచి మచిలీపట్నం ఎంపీగా బాలశౌరి?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మచిలీపట్నం వైసీపీ ఎంపీ బాలశౌరి జనసేన నుంచి పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇటీవల ఆయన ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేసిన విషయం విదితమే. అనంతరం ఆయన జనసేనలోకి వెళుతున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో మచిలీపట్నం కేంద్రంగా జరిగే సభలో ఆయన జనసేనలోకి చేరనున్నట్లు తెలిసింది. రాబోయే ఎన్నికల్లో జనసేన-టీడీపీ పొత్తుల్లో భాగంగా బాలశౌరి మచిలీపట్నం ఎంపీగా బరిలో దిగనున్నట్లు సమాచారం. జనసేన-టీడీపీ పొత్తుల్లో భాగంగా మచిలీపట్నంతోపాటు గుంటూరు ఎంపీ స్థానాలను జనసేకు కేటాయించినట్లు తెలిసింది. దీంతో మచిలీపట్నం లేదా గుంటూరు నుంచి బాలశౌరిని పోటీకి దించేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. కాపు సామాజిక వర్గానికి చెందిన బాలశౌరికి మచిలీపట్నం పార్లమెంటు నుంచి పోటీ చేయిస్తే, విజయవకాశాలు ఉంటాయని జనసేన భావిస్తున్నట్లు సమాచారం.

విమానాలు రద్దు... ప్రయాణికుల ఇక్కట్లు

విశాఖపట్నం: ప్రతికూల వాతావరణం కారణంగా విశాఖ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం నుంచి వివిధ విమాన సర్వీసులు రద్దయ్యాయి. విశాఖకు వచ్చేవి, విశాఖ నుంచి వెళ్లే సర్వీసులు రద్దు కావడంతో పండుగ వేళ గమ్యస్థానానికి చేరుకోలేక ప్రయాణికులు ఇబ్బందులెదుర్కొన్నారు. విశాఖ నుంచి దిల్లీ వెళ్లే ఇండిగో, దిల్లీ ఎయిర్ ఇండియా విమానాలు... విజయవాడ -ముంబయి,హైదరాబాద్-చెన్నై ఇండిగో, ఎయిర్ఇండియా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఒక్కసారిగా వాతావరణం మారి మంచు కురుస్తుండటం వల్లే విమానాలు రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా పండుగ రోజు తమను గమ్యస్థానాలకు వెళ్లకుండా చేశారని ప్రయాణికులు ఇండిగో, ఎయిర్ఇండియా విమాన సంస్థల అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు.

సాహితి

చలి పద్యం

అర్ధరాత్రి దీప స్తంభం కింద
చౌరస్తాలో కుక్కలన్నీ చేరి
ఆకాశం వైపు మోరెత్తి అరుస్తున్నాయి

వాటి మెలుకువ
భాష నాకు తెలవదు

తెల్లారే ముందు
గంప కింద కమ్మిన

కోడి కొక్కరోకో పిలుస్తోంది

అది ఏమని పిలుస్తుందో
కాంతి మాట నాకు అర్థం కాదు

చలికి నిద్ర పట్టక చీకట్లో
నన్ను వెతుక్కుంటున్నాను

గజ గజ చలిలో
కాశ్మీర్ శాలువా ఒకటి
నులివెచ్చని పద్యంతో సన్మానించింది

-జూకంటి జగన్నాథం

ప్రజారచయిత పడాలకు అక్షర నీరాజనం!

మందలపర్తి కిషోర్, సెల్: 8179691822

సంస్కరణ సేనాని కందుకూరి వీరేశలింగం పేరిట వెలసిన "శ్రీ కందుకూరి వీరేశలింగం ఆస్తిక కళాశాల" ప్రాంగణంలోనే పడాల రామారావు శతజయంతి సభ జనవరి ప్రారంభంలో నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు- కార్మిక నాయకుడు- రాజకీయ నేత- జనరంజకమైన వక్త- అభ్యుదయ రచయిత-సంపాదకుడు- శతాధిక గ్రంథకర్త పడాల రామారావు 1922 ఏప్రిల్లో పుట్టి, 2006 ఏప్రిల్లో కన్నుమూసిందీ రాజమండ్రిలోనే! అరవయ్యేళ్ళ తన క్రియాశీలక సామాజిక జీవనాన్ని పడాల ఈ నగరంలోనే గడిపారు. అందుకే, సాహిత్య ఎకాడెమీ-అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పడాల శతజయంతి సదస్సు రాజమండ్రిలోనే జరగడం అన్ని విధాలా భావ్యం, సంభావ్యం!

పదకొండు పన్నెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రాజమండ్రి అనే రాజమహేంద్రవరం గడ్డమీద వెయ్యేళ్ళకు పైగా కవి పండితులు తిరుగాడుతున్నారని సాంస్కృతిక చరిత్ర చెప్తోంది. మహాభారతాన్ని తెలుగులో పౌరాణిక కావ్యంగా అనువదించడానికి ఘంటం పూనిన నన్నయ, తెలుగులో తొలి వైజ్ఞానిక కావ్యంగా "సారగణిత సంగ్రహం" మనకందించిన పావులూరు మల్లన ఇక్కడ వాళ్ళే! (సారగణిత సంగ్రహంలో ఇచ్చిన ఓ చిక్కులెక్క ఆధారంగానే శ్రీపాద "వడ్లగింజలు" కథ రాశారు!) పదో శతాబ్దిలో మొదలైన సంప్రదాయ సాహితికి కొనసాగింపుగా, ఇరవయ్యో శతాబ్దిలో మధునాపంతుల "ఆంధ్రపురాణం" రాసిందీ ఇక్కడే! అందుకే, "రాజమండ్రిలో సాహిత్య సుందరి అందెలూ బావిలీలూ ఇంకా మానలేదు!" అని 1960లోనే అన్నారు తిలక్.

తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం ఈ గోదారి గట్టునే, పందొమ్మిదో శతాబ్దిలోనే, మొదలయింది! కందుకూరి వీరేశలింగం నాలుగు సంవత్సరాల వాడిగా వున్నప్పుడే, 1852లోనే, సామినేని (స్వామినీన) ముద్దు నరసింహం నాయుడు - ముద్దుకృష్ణ ముత్తాత - హేతువాద భావాలతో కూడిన తన రచన "హితసూచని" రచించాడు; ఆ పుస్తకాన్ని ఆయన కుమారుడు 1862లో -గురజాడ పుట్టిన ఏడాదే- రాజమండ్రిలోనే వెలువరించారు. ఈ రాజమండ్రిలోనే గిడుగు రామమూర్తి కూడా 1936 నుంచి కడదాకా గడిపారు. సుమారు నూటపాతికేళ్ళ కిందట, రాజమండ్రిలోనే పుట్టి, గొంతెత్తిన కుసుమ ధర్మన్న వీరేశలింగం ప్రభావ పరిధిలోనే తన ప్రయాణం ప్రారంభించాడు. ఇరవయ్యేళ్ళ ప్రాయంలోనే "మాకొద్దీ నల్లదొరతనమూ" అని గర్జించాడు. తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలన్నిట్లోకీ దళితుల సంఖ్య అత్యధికంగా ఉన్న గోదావరీతీరం నుంచే ఈ నిరసన గళం వినిపించడం యుక్తంగానే వుంది! దాదాపు అదే రోజుల్లోనే రాజమండ్రి కేంద్రంగా ప్రజా జీవనంలోకి అడుగుపెట్టిన క్రొవ్విడి లింగరాజు గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు - సంపాదకుడు -అనువాదకుడు - రాజకీయ నాయకుడు. "కాంగ్రెస్" పత్రిక సంపాదకుడిగా లింగరాజు చరిత్రాత్మక పాత్ర పోషించారు. గోర్కియ్ రష్యన్ భాషలో రాసిన "మాత్" (తల్లి) నవల ఇరవయ్యో శతాబ్ది తొలినాళ్ళలో ప్రపంచ ప్రసిద్ధి పొందింది. లింగరాజు ఆ నవలకు సంక్షిప్త అనువాదాన్ని "అమ్మ" పేరిట వెలువరించగా గద్దె లింగయ్య "ఆదర్శ గ్రంథమండలి" 1956లో దాన్ని ప్రచురించింది.

చదువురాని తన తండ్రిని రాజమండ్రి ఇత్తడి వర్తకులు మోసంచేసి, ఆస్తి కాజేశారని, పడాల రామారావే రాశారు. మధ్యతరగతికి చెందిన తమ కుటుంబం అలా పేదరికం పాలైందని కూడా ఆయన రాశారు. అందుకే, తండ్రి తనను చదివించాలనుకున్నా, పేదరికం వల్లనే ఆ చదువు అర్ధంతరంగా ఆగిపోవలసి వచ్చిందని కూడా రామారావు రాసుకున్నారు. నవయవ్వన దశలోనే జీవనసమరంలోకి అడుగుపెట్టిన పడాల మొదట్లో కిరాణాకొట్లలో పద్దులు రాశారు; కొన్నేళ్ళకు తానే కిరాణా కొట్టు ఒకటి కొని, తమ్ముడి సహకారంతో వ్యాపారం చేశారు. సరుకు కొనుగోళ్ల కోసం నలుమూలలా తిరిగి -డబ్బు మాటెలావున్నా- జీవితానుభవం సంపాదించారు. ఆ క్రమంలోనే అల్లూరి శ్రీరామరాజు (జనశ్రుతిలో 'అల్లూరి సీతారామరాజు'గా స్థిరపడిన మన్నెం పోరాట యోధుడు కుటుంబసభ్యులతోనూ, మిత్రుడైన చిటికెల భాస్కరరావుతోనూ, అనుచరుడైన మల్లుదొరతోనూ పడాలకు పరిచయాలు ఏర్పడ్డాయి. వాళ్ళద్వారా తెలిసిన పరోక్ష కథనాల ప్రాతిపదికగానే పడాల 'ఆంధ్రశ్రీ' నాటకం, 'అల్లూరి సీతారామరాజు' జీవితచరిత్ర పుస్తకాలు రాశారు. పడాలకు రచయితగా ఓ గుర్తింపు దక్కడానికి ఈ రెండు

పుస్తకాలే కారణం.

పడాల రామారావు పుట్టింది చేనేత కార్మికుల కుటుంబంలో. చిన్నతనంలోనే ఆయన చేనేత కార్మికుల కష్టనష్టాలను గమనించి వారిని సంఘటితం చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. ఆ కృషిలో తనకు స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు "నేత" పుత్సల సత్యనారాయణ ప్రోత్సాహం, మార్గదర్శకత్వం లభించాయని రామారావు పేర్కొన్నారు. తనను చేనేత కార్మికులను సంఘటితం చేసే దిశగా మొట్టమొదట ప్రోత్సహించిన సహచరుడు, మరో స్వాతంత్ర్య సమరయోధుడు చిట్టూరి ప్రభాకర చౌదరి అనే వాస్తవాన్ని ఆయన దాచిపెట్టలేదు. రామారావు ట్రేడ్ యూనియన్ కృషి చేనేతకే పరిమితం కాలేదు. చిన్న- మధ్యతరగతి పరిశ్రమల్లో పనిచేసే వందలాది అసంఘటిత కార్మికులను సుసంఘటితం చేసేందుకు ఆయన తన కృషి కొనసాగించారు.

పడాల రామారావు చదువుకున్నది పరిమితంగానే అయినా, విస్తృతంగా రాశారు. ముందే చెప్పుకున్నట్లు ఆయన శతాధిక గ్రంథకర్త. ముఖ్యంగా నవయువ పాఠక రచయితలను ఉద్దేశించి ఆయన తన రచనలు చేశారు. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు, పడాల రామారావు రచనల్లో అత్యధిక ప్రాచుర్యానికి నోచుకున్న రచన 'ఆంధ్రశ్రీ.' అల్లూరి శ్రీరామరాజు జీవిత కథకు పడాల కల్పించిన రూపక రూపం "ఆంధ్రశ్రీ". దాన్ని మెచ్చిన ఎన్.టి.ఆర్. "ఆంధ్రశ్రీ" ఆధారంగా "అల్లూరి సీతారామరాజు" సినిమా తియ్యాలని సంకల్పించి పడాలను మద్రాస్ తీసుకుపోయారు. ఆ సినిమా సంకల్పం ఎన్నటికీ ఈడేరకపోవడంతో అదే కథను 'అల్లూరి సీతారామరాజు జీవిత కథ' పేరిట పడాల యువ పాఠకుల కోసం రచించారు. ఇది కూడా ప్రచురం. పడాల రచనల్లో 'శివకన్య', 'శివయోగి' లాంటి జానపద థ్రిల్లర్లు రచయితకు - ప్రచురణకర్తకు వాణిజ్యపరమైన ప్రయోజనాన్ని సిద్ధింపచేశాయి. అలాగే, ఆయన రాసిన 'రామాయణం' -'ఉత్తర రామాయణం', 'మహాభారతం', 'భాగవతం', 'శృంగార నైషధం', 'కాదంబరి', 'శకుంతల', 'మనుచరిత్ర', 'పారిజాతాపహరణం' లాంటివి కూడా అలాంటి ప్రయోజనాన్నే సాధించగలిగాయి. పడాల నడిపించిన 'చౌ చౌ' పత్రిక కూడా యువపాఠకుల-రచయితల అభిరుచులకూ అవసరాలకూ తగినట్లుగా సాగింది.

పడాల రామారావు శతజయంతి సందర్భంగా, ఆయన బహుముఖీన కృషిని విశ్లేషించి, ఈ తరం పాఠకులకు తెలియచేసేందుకు కేంద్ర సాహిత్య ఎకాడెమీ-అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడిగా జనవరి ఆరోతేదీన ఓ సదస్సు నిర్వహించింది. ప్రారంభ సమావేశానికి సాహిత్య అకాడెమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు మందలపర్తి కిషోర్ అధ్యక్షత వహించి, స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర అ.ర.సం. ప్రధాన కార్యదర్శి-సాహిత్య అకాడెమీ తెలుగు సలహామండలి సభ్యుడు వల్లూరి శివప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ విద్యా నియంత్రణ-పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ ఆకుల రామలింగేశ్వరరావు, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అ.ర.సం.కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, అభ్యుదయ రచయితల సంఘం తూర్పు గోదావరి శాఖ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, ఎ.ఐ.టి.యు.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కర్రి రామారెడ్డి, పడాల జీవితసాహిత్యాలపై పిహెచ్‌డి చేసిన పెనుమాకల భాస్కరరావు, తరపట్ల సత్యనారాయణ, వాడ్రేవు సుందరరావు, తోటకూర వెంకట నారాయణ, బిఎచ్.వి. రమాదేవి, ఎబెల్ రాజబాబు, ఆర్‌వి పి.వి.బి.సంజీవరావు, సూర్యనారాయణరాజు తదితరులు ఈ శతజయంతి సదస్సులో పాల్గొన్నారు.

మా పల్లె భారతి

తూరుపునుదయించే సూర్యుడి మల్లే
మా పల్లే భారతి
హరిత కిరణాల్ని మూటగట్టుకొని
గూడెం గుండెలో కోడై కూస్తుంది
భళ్లున తెల్లవారంగనే
అడవుల్ని కప్పుకున్న చలి కౌగిళ్లు
గుడిసెల ముందు నెగళ్లతో
పారాహుషారవుతుంటే
కొడవళ్లు నాగళ్లు చేతబూని
పొలం వైపు నడిచింది
మా పల్లె భారతి

- - -

సీమిడి ముక్కు సిగ్గుబిళ్లతో
వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్నదాన్ని
గట్టుపైదించి బండకింది ఎండ్రికాయని
ఆడుకొమ్మని యిచ్చింది
మా పల్లె భారతి
జిన్నెచెట్టు చిటారుకొమ్మనున్న
తేనె పట్టుకోసం
గోనె సంచుల్ని తొడిగింది
మా పల్లె భారతి
కొండపై నుంచి పల్లెవైపు వంగిన
ఇంద్రధనుస్సును చూసి
పురివిప్పిన నెమలయ్యింది
మా పల్లె భారతి

- - -

సంక్రాంతి పండక్కు సకినాలు చేసి
ముంగిళ్లనిండా ముగ్గుల్ని పరిచి
గొబ్బిళ్లపై పూల సిగ్గుల్ని వంచి
రేలా పాటల్లో గాలి పటమై ఎగిరింది
మా పల్లె భారతి
అంతరిస్తున్న డూ..డూ..బసవన్నలకు
హారతులిచ్చింది హరిదాసు కీర్తనలకు
సరిగమలు పలికింది
గుమ్మిలో ధాన్యము దండిగా లేకున్నా
కొత్త అల్లుడికి తీపి పొంగలయ్యింది

- - -

కృషి కిసానుకు కవాతు గీతమై
పుడమి బిడ్డలకు జోలపాడింది
కళ్లల్లో కన్నీళ్లు తచ్చాడుతుంటే
భోగిమంటల తోటికాంతుల్ని చిమ్మింది
కోటిఆశల వేకువకు స్వాగతం పలికింది
మా పల్లె భారతి...!

డా.కటుకోఝ్వల రమేష్,
సెల్:9949083327

పల్లె గూటి పండగ

ఉషఃకాల హిమబిందువులు
పుడమికి ముత్యాలు అద్దగా
మకరరాశి నెరజాణ
భానుడ్ని ఆహ్వానిస్తుండగా

ఎద ఎదనూ మురిపించే
సంతోషాల తోరణాలతో
సంబరాల తేరువుపై విచ్చేస్తున్న
సంక్రాంతి లక్ష్మి కోసం
తిరునాళ్ళ శోభ సంతరించుకొన్న
పల్లె అందాలు ఆస్వాదింప,
జీవన పోరాటంలో
కాంక్రీటు వనాలు చేరిన
పల్లె వలస పక్షులు
ఉరుకుల పరుగుల
జీవనానికి దూరంగా

కాలుష్య కౌగిలి విడుల్చుకొని
సౌధాల అడవులు విడిచి
విచ్చేస్తున్నాయ్! వచ్చేస్తున్నాయ్!
అమ్మగూటికి.

బిడ్డల రాకకోసం
కళ్ళు చేటంతలు చేసిన
పల్లెతల్లికి
నిజంగా సంక్రాంతి పండగే!

వేమూరి శ్రీనివాస్,
9912128967

సంక్రాంతి...జీవన సూత్రాలు

వలిపి శ్రీరాములు, 9441135762

మన సంప్రదాయంలో ప్రతి ఆచారం, సంప్రదాయం వెనుక భౌతికం, మానసికం, ఆధ్యాత్మికం అనే మూడు ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. సంక్రాంతి అంటే పిండివంటలు చేసుకోవడం... దేవాలయాలకు వెళ్లి దండం పెట్టుకోవడమే కాదు. మన పెద్దలు అనుసరించే సంప్రదాయాల వెనకున్న మర్మం ఏమిటి? వాటి నుంచి మనమేం నేర్చుకోవాలి? వాటిని శాస్త్రీయంగా ఎలా అర్థం చేసుకోవాలి... అనేది తెలుసుకోవడం అవసరం.

ఓర్పును నేర్పే ముగ్గులు : ఇంటి ముందు లోగిళ్లలో ఒక పెద్ద రథం ముగ్గో, నక్షత్రం ముగ్గో వేస్తే చాలు. గంటసేపు వ్యాయామం చేసిన శ్రమకు సమానం. ముగ్గు వేయడం అంటే.. బోలెడన్ని చుక్కలు పెట్టాలి. వాటన్నిటినీ కలుపుతూ గీతలు గీయాలి. ఒక ఆకారాన్ని తీసుకురావాలి. ఆ క్రమంలో లెక్కపెట్టుకోలేనన్నిసార్లు కదలాల్సి వస్తుంది. పైటచెంగును సరి చేసుకుంటూ... జడను వెనక్కు వేసుకుంటూనే ముగ్గు మీద బోలెడంత ఏకాగ్రతను సంధించాలి. ముగ్గు ఇంటికి అలంకరణే కాదు. మనసుకు, శరీరానికి ఓర్పును, నేర్పును అందించే సమస్యాపూరణం లాంటిది. ముగ్గులు మనకో తాత్విక దృక్పథాన్ని తెలియజేస్తాయి.

గంగిరెద్దులు.. హరిదాసులు... భిక్షానికీ ఓ ధర్మం..: గంగిరెద్దుల వాడైనా... హరిదాసైనా ఏదో ఒక మంచి విషయాన్ని చెప్పే బిచ్చమెత్తుకుంటారు. గంగిరెద్దుల వాడైతే ఇల్లు కలవాళ్లు ఏదిచ్చినా గంగిరెద్దు మీదే వేస్తాడు తప్ప చేతికి తీసుకోడు. పాత చీరలిస్తే వాటినే తీసుకుంటారు. హరిదాసు కూడా ఏడాదికి ఒకసారే వచ్చి హరినామ సంకీర్తనలు పాడి.. గిన్నెడు బియ్యం తీసుకుని సంతృప్తిగా ఇంటికెళ్లిపోతాడు. పండగ పోయాక మళ్లీ ఏ వీధిలోనూ కనిపించడు. హరిదాసు ఇంటి ముందుకొచ్చి గొబ్బెమ్మల్ని తొక్కి వెళితే మంచిది అని చెబుతారు పెద్దలు.

అసహ్యం నుంచి అద్భుతాల గొబ్బెమ్మ: కృష్ణ భక్తురాలైన గోపెమ్మ అనే పేరు నుంచి పుట్టిందే గొబ్బెమ్మ. ఈ భూమి మీదున్న దేన్నీ అసహ్యించుకోకూడదు. ప్రతిదీ ప్రకృతి ప్రసాదితం. అసహ్యమైన పేడను కూడా అద్భుతంగా మలిస్తే అది గొబ్బెమ్మ అవుతుంది. జీవి కడుపులో ఉన్నంత కాలం పవిత్రమైనది. తల్లి కడుపు దాటి నేల మీద పడగానే అపవిత్రమైపోతుంది. అందుకే, నేల మీద పడని ఆవుపేడతోనే గొబ్బెమ్మలను చేస్తారు.

జీవితం దారం వంటిదని చెప్పే పతంగం: మనిషికి ఆత్మనిగ్రహం లేకపోతే జీవితంలో ఎన్నో సమస్యల్ని కొని తెచ్చుకోవాల్సి వస్తుంది. సన్నని దారంతో ఆకాశంలో ఎగిరే గాలిపటాన్ని అదుపులో పెట్టగలిగినట్లు.. మనల్ని మనం అదుపులో పెట్టుకోవాలని చెబుతుంది గాలిపటం. లాగితే తెగిపోతుంది. వదలకుంటే ఎగరలేదు. రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ఆడిస్తేనే గాలిపటమైనా, జీవితమైనా! చేతిలో దారం ఉంది కదా అని ఎంత దూరమైనా గాలిపటాన్ని వదల్లేము. చుట్టచుట్టి గుప్పెట్లోకి తీసుకోవాల్సిందే. జీవితం కూడా అంతే. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా ఎగిరెగిరిపడక ఒదిగి ఉంటేనే జీవితం సాఫీగా సాగిపోతుందన్న సందేశం దాగి ఉంటుంది.

కోడిపందేలు... యుద్ధనీతిని గెలిపించే పందెం: పండగ పరమార్థాన్ని మరిచిపోయి దాన్ని పరహింసగా మార్చాం. నేడు జరుగుతున్న కోడిపందేలే అందుకు నిదర్శనం. కోడిపందేలకు తరాల చరిత్ర ఉంది. కాని ఆ రోజుల్లో కోళ్లకు కత్తులు కట్టి ఆనందించేవారు కాదు. ఇప్పుడు కత్తులు కట్టి, డబ్బు కట్టలు పెట్టి జూదంగా మార్చేశారు. పాతరోజుల్లో ఇద్దరి మధ్య వైరం ఏర్పడితే దాన్ని కోడిపందెం ద్వారా పరిష్కరించేవారు మధ్యవర్తులు. పల్నాటి కాలంలో మాచర్ల, గురజాల మధ్య గొడవ యుద్ధానికి దారితీసింది. అలాంటి సమస్యను కోడిపందెమే పరిష్కరించింది. యుద్ధనీతిని తెలియజేసింది.

పశు పూజలు...శ్రమకు కృతజ్ఞత చెల్లింపులు: సంక్రాంతికి ఇంటినిండా ధాన్యం వచ్చిందంటే.. అది పశువుల పుణ్యం. ఏడాది పొడవునా పశువులతో చాకిరీ చేయించడమే కాదు. పండగరోజైనా వాటిని పూజించి కృతజ్ఞత చెప్పుకోవాలంటుంది పశువుల పూజ. ఆ రోజు రైతులు నాగలి కట్టరు. ఎద్దుల మీద కాడి మోపరు. బండ్లు తోలరు. అందుకే 'కనుమ రోజు కాకైనా కదలదు' అంటారు. కనుమను పశువుల పండుగ అంటారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు.

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం-2023

కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం-2023 కొరకు 2023వ సంవత్సరంలో ముద్రితమైన కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. మూడేసి ప్రతులను జనవరి31, 2024 లోపు పంపగలరు. బహుమతి పొందిన కథా సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున ఏప్రిల్‌లో పదివేల నగదు పురస్కారం, జ్ఞాపిక ప్రదానం జరుగును.

మీ ప్రతులు పంపవల్సిన చిరునామా : అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15- 120/4 /1, రహత్ నాగర్ కాలనీ,
నాగర్ కర్నూల్ -509209, తెలంగాణ రాష్ట్రం.

అధ్యక్షులు-వనపట్ల సుబ్బయ్య, 9492765358 ప్రధానకార్యదర్శి-పి.వహీద్‌ఖాన్, 94419 46909

జ్ఞాపకాల దొంతరల్లో...

పండుగంటే గుర్తొచ్చేది పూతరేకులాంటి బాల్యమే
మరీ సంకురాతిరంటే ఎక్కడలేని కుశాలొచ్చేది
అమ్మ, నానమ్మలు చేసిన అరిసెలు, సకినాలు
లాలాజలాన్ని ఊటలెత్తించేవి
అటకపై డబ్బాల్లో దాక్కున్నా
నిచ్చెనలు వేసి మరీ దింపి నోట్లో మర ఆడించేవాళ్ళం
సుప్రభాతవేళకి మునుపే పాత సామాన్లన్నీ
భోగిమంటలకి ఆహుతిచ్చి
చలిగీతానికి వయొలిన్‌రాగం ఆలపించే వాళ్ళం
సంధ్య కాలాన భోగిపళ్ళు శిరస్సుపై నాట్యం
ఆడించేవాళ్లు పెద్దవాళ్లు సూత్రధారులై
వాకిలినిండా రంగవల్లులద్దేది అమ్మ ...తోడుగా నాన్నమ్మ
ఒకటేమిటి అన్ని రకాల ముగ్గులు
రంగులద్దేది మాత్రం అక్కా నేనే
పట్టుపరికిణి కట్టిన పడతుల్లా
సింగారించే వాళ్ళం ముగ్గుల్ని గొబ్బెమ్మలతో
మేము ముస్తాబైనట్లు
హరిదాస సంకీర్తనలు
వాకిళ్లను మెరిపించి మురిపించే తారకలయ్యేవి
ఇంకా ఇప్పటి దాకా అవే జ్ఞాపకాల దొంతరలు గదిమది నిండా
మళ్లీ ఆ రోజులొస్తేఎంత బాగుండు
ఈ కృత్రిమత్వమంతా మాయమై...

రాధ తాళ్లూరి

పాలమూరు సాహితి అవార్డు - 2023కు కవితాసంపుటాల ఆహ్వానం

తెలుగు సాహిత్యంలో ఉత్తమ వచన కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు ప్రతి సంవత్సరం పాలమూరు సాహితీ అవార్డులను ప్రదానం చేస్తున్న సంగతి సాహితీ వేత్తలందరికి తెలిసిందే. గతంలో ఈ అవార్డులను ప్రముఖ కవులు డా. రాధేయ, డా. కాసుల లింగారెడ్డి, డా. పెన్నా శివరామకృష్ణ, కందుకూరి శ్రీరాములు, అంబటి నారాయణ, ఎస్.హరగోపాల్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, చిత్తలూరి సత్యనారాయణ, తగుళ్ళ గోపాల్, డాక్టర్ జెల్ది విద్యాధర్ రావులు ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ పురస్కారం కోసం 2023 సంవత్సరంలో ముద్రితమైన వచన కవితా సంపుటాలను మాత్రమే మూడేసి ప్రతులను పంపించాల్సిందిగా కోరుతున్నారు. కవులు తమ ప్రతులను డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇ.నం. 8-5-38, టీచర్స్ కాలని, మహబూబ్ నగర్ - 509001, తెలంగాణ రాష్ట్రం అనే చిరునామాకు జనవరి 31 లోపున పంపాలని ఆయన కోరారు. బహుమతి పొందిన ఉత్తమ వచన కవితా సంపుటికి రూ.5,116/- నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తారు.

డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, వ్యవస్థాపకులు, 9032844017
పాలమూరు సాహితి అవార్డ్, మహబూబ్ నగర్ - 509001

ఐదేళ్లలో 11మంది నేతల గుడ్‌బై

ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మణిపూర్ నుంచి భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపడుతున్న వేళ సీనియర్ నేత మిలింద్ దేవరా రాజీనామా చేయడం ఆ పార్టీకి గట్టి షాక్‌గానే భావించాల్సి ఉంటుంది. లోక్ సభ ఎన్నికల ముందు కీలక నేతలు రాజీనామాలు చేయడం కాంగ్రెస్‌ను కలవరానికి గురిచేస్తోంది. ప్రత్యేకించి రాహుల్ గాంధీకి సన్నిహితులైన యువ నాయకులు పార్టీని వీడుతున్నారు. వీరంతా బీజేపీలో చేరి కీలక పదవులు అనుభవిస్తున్నారు. మిలింద్ నిష్క్రమణ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వంతో గాంధీ కుటుంబానికి పటిష్ఠ సంబంధాలు లేవన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్‌లో నిరీక్షిస్తూ తమ రాజకీయ భవితవ్యాన్ని పణంగా పెట్టడానికి యువ నాయకులు సుముఖంగా లేరు. 'చాలా సుదీర్ఘ, వ్యర్థ నిరీక్షణ' తర్వాత అతను పార్టీని విడిచిపెట్టినట్లు దేవరా సన్నిహిత వర్గాలు తెలిపాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దశాబ్దాలుగా తన కుటుంబం ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై సౌత్ నుంచి పోటీచేయాలని మిలింద్ భావిస్తుండగా.. ఇందుకు తగిన భరోసా అధిష్ఠానం ఇవ్వలేకపోయిందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ స్థానం తమదేనని శివసేన (యూబీటీ) బహిరంగంగానే చెబుతుండగా మిలింద్ దేవరా సీటుకు భద్రతపై కాంగ్రెస్ హామీ ఇవ్వలేకపోయిందని, ఎటువంటి పరిష్కారం లేకుండా ఒక యువ నాయకుడి రాజకీయ భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని దేవరా సన్నిహితులు వాపోయారు. దీంతో కాంగ్రెస్‌తో 55 ఏళ్ల బంధానికి ముగింపు పలికారు. దేవరా దివంగత తండ్రి మురళీ దేవరా యూపీఏ ప్రభుత్వంలో కీలకమైన పెట్రోలియం మంత్రిగా ఉన్నారు. తలెత్తిన సమస్యలకు పరిష్కారం చూపకపోవడం, పార్టీలోని అంతర్గత వర్గపోరు కారణంగా గతంలో రాహుల్ గాంధీ అత్యంత సన్నిహితులైన అనేక మంది మంచి నాయకులు పార్టీని వీడారు. రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ మాత్రమే ఇందుకు మినహాయింపు. మిలింద్ ఒక్కరే కాదు... గడచిన ఐదేళ్లలో చూసినట్లయితే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌కి చెందిన మరో 10 మంది ముఖ్య నేతలు రాజీనామా చేశారు. కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ మే 16, 2022న కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. అయితే సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన ఒక వారం తర్వాత ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయం అకస్మాత్తుగా తీసుకోలేదని, తాను ఏ పార్టీలో చేరబోనని ఆయన తెలిపారు. కాంగ్రెస్ కురువృద్ధుడు గులాం నబీ ఆజాద్ రాజీనామా 2022లో పార్టీలో కుదుపునకు కారణమైంది. ప్రస్తుతం ఆయన జమ్మూకశ్మీర్ లో డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ అనే ప్రాంతీయ పార్టీని స్థాపించారు. గుజరాత్ పటీదార్ నాయకుడు హార్దిక్ పటేల్ 2019లో కాంగ్రెస్ లో చేరారు. అనంతరం 2022లో కాంగ్రెస్ కు రాజీనామా చేస్తూ ఏఐసీసీకి లేఖ రాశారు. తరువాత బీజేపీలో చేరిపోయారు. కేంద్ర మాజీ మంత్రి, అశ్వనీ కుమార్ పంజాబ్ ఎన్నికల కు కొద్ది రోజుల ముందు ఫిబ్రవరి 2022లో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. పార్టీలో ఆయన అనుభవజ్ఞుడు. 2019 లోక్ సభ ఎన్నికలలో యూపీఏ కూటమి ఓటమి తర్వాత పార్టీని విడిచిపెట్టిన మొదటి సీనియర్ నేత ఈయనే. పంజాబ్ కాంగ్రెస్ కు నాయకత్వం వహించిన సునీల్ జాఖర్ 2022లో అప్పటి ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీని విమర్శించి పార్టీని విడిచిపెట్టారు. ఆయన అదే ఏడాది మేలో బీజేపీలో చేరారు. జులైలో పంజాబ్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. కేంద్ర మాజీ మంత్రి ఆర్‌పీఎన్ సింగ్ కాంగ్రెస్‌ను విడిచిపెట్టి 2022 జనవరిలో బీజేపీలో చేరారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు ఈ చేరిక జరిగింది. వెనకబడిన వర్గాల నేతగా పేరున్న ఆయన్ని రాష్ట్ర ఎన్నికల ప్రచారాల్లో పక్కన పెట్టడంతో కలత చెంది పార్టీ మారారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న జ్యోతిరాదిత్య సింధియా కూడా కాంగ్రెస్‌ను విడిచిపెట్టి, 2019లో బీజేపీలో చేరారు. మధ్యప్రదేశ్ లో కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని పడగొట్టి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వ ఏర్పాటులో కీలకమైన ఫిరాయింపులను ఆయన ప్రోత్సహించారు. ఒకప్పుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన కేంద్ర మాజీ మంత్రి జితిన్ ప్రసాద 2021లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ఆయన అగ్ర బ్రాహ్మణ కులానికి చెందిన వ్యక్తి. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అల్పేష్ ఠాకోర్, రెండు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం చేసి 2019 జులైలో పార్టీని వీడారు. కొన్నాళ్లకు బీజేపీలో చేరారు. 2023లో జరిగిన ఎన్నికల్లో గుజరాత్ లోని గాంధీనగర్ సౌత్ నుంచి గెలుపొందారు. కాంగ్రెస్ కురువృద్ధుడు ఎకే ఆంటోనీ కుమారుడు అనిల్ ఆంటోనీ గత ఏడాది జనవరిలో పార్టీని వీడి, ఫిబ్రవరిలో బీజేపీలో చేరారు. ఎకే ఆంటోనీ మాత్రం తన కుమారుడి నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఇలా కాంగ్రెస్ పార్టీని ఈ ఐదేళ్లలో ఎంతో మంది కీలకనేతలు విడిచిపెట్టారు. లోక్ సభ ఎన్నికల సమయంలో ఆయా రాష్ట్రాల్లో క్రియాశీలకంగా ఉండే నేతల నిష్క్రమణ ఆ పార్టీపై ఎలా ప్రభావం చూపిస్తుందోనని నేతలు ఆందోళన చెందుతున్నారు.

విధేయత లేదు...రాజకీయమే: రౌత్

ముంబై: కాంగ్రెస్ పార్టీని వీడిన మిలింద్ దేవరాపై శివసేన ఉద్ధవ్ థాక్రే వర్గం నాయకుడు సంజయ్ రౌత్ విరుచుకుపడ్డారు. ప్రస్తుత రోజుల్లో అధికారం కోసం మాత్రమే రాజకీయాలు జరుగుతున్నాయని అన్నారు. పార్టీకి విధేయత అనేది ఉనికిలో లేదని చెప్పారు. మిలింద్ దేవరా తండ్రి మురళీ దేవరా గురించి ప్రస్తావిస్తూ... పార్టీ కోసం ఏమి చేయాలో తెలిసిన గొప్ప నాయకుడని కొనియాడారు. విధేయత, భావజాలం వంటి అంశాలు ఇప్పుడు లేవని, రాజకీయాలు కేవలం అధికారం గురించి మాత్రమే నడుస్తున్నాయన్నారు. తనకు మిలింద్ దేవరా తెలుసునని, ఆయన పెద్ద నాయకుడని, కాంగ్రెస్‌తో ప్రత్యేక అనుబంధం కలిగి ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు మిలింద్ దేవర రాజీనామా చేయడంపై రౌత్ పైవిధంగా స్పందించారు.

తాజ్ మహల్‌ను మించిన అయోధ్య మసీదు

ప్రత్యేకతలు వివరించిన బీజేపీ నేత

లక్నో: అయోధ్యలో నిర్మించతలపెట్టిన మసీదు నిర్మాణం ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్ కంటే అద్భుతంగా ఉంటుందని బీజేపీ నేత హాజీ అర్ఫత్ షేక్ వివరించారు. అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీ మసీదు స్థలంలో రామ మందిర నిర్మాణానికి సుప్రీంకోర్టు అనుమతిస్తూ పట్టణంలో మరోచోట కొత్త మసీదు నిర్మాణానికి సున్నీ వక్ఫ్‌బోర్డుకు ఐదెకరాల స్థలం కేటాయించాలని న్యాయస్థానం కేంద్రాన్ని గతంలో ఆదేశించింది. మసీదు నిర్మాణం కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం స్థలం కేటాయించింది. భారత్‌లోనే అతిపెద్ద మసీదుగా చెబుతున్న ఈ ప్రాంగణంలో 21 అడుగుల ఎత్తు, 36 అడుగుల వెడల్పుతో ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్ ఉంటుందని షేక్ తెలిపారు. ఈ మసీదు తాజ్‌మహల్ కంటే అద్భుతంగా ఉంటుందని చెప్పారు. కేవలం నమాజ్ చేసేందుకే కాకుండా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 500 పడకల క్యాన్సర్ ఆసుపత్రి ఉందని తెలిపారు. క్యాన్సర్ చికిత్స కోసం రాష్ట్రం నుంచి ఎవరూ ముంబై తదితర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. మసీదు ప్రాంగణంలో దంత, వైద్య, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయని వెల్లడించారు. అన్ని మతాలు, కులాల ప్రజలు భోజనం చేసే వెసులుబాటు ఉందని, ఒకేసారి 5 వేల మంది భోజనం చేయవచ్చని వివరించారు. అయోధ్యలో మసీదు నిర్మాణం కోసం ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసిన ట్రస్ట్ ఐఐసీఎఫ్ అధ్యక్షుడు జుఫర్ అహ్మద్ ఫరూఖీ... షేక్‌ను నియమించారు. ఆయన గత సంవత్సరం ఐఐసీఎఫ్‌లో ట్రస్టీగా, దాని సలహాదారుల్లో ఒకరిగా నియమితులయ్యారు. మహారాష్ట్ర స్టేట్ కమిషన్ ఫర్ మైనారిటీ మాజీ చైర్‌పర్సన్ అయిన షేక్... మసీదు మస్జిద్-ఎ-అయోధ్య పేరును మహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదుగా మార్చారు. మసీదు నిర్మాణం కోసం ఐఐఎఫ్‌సీ ఫిబ్రవరి - మార్చి నెలల్లో ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరిస్తుందని షేక్ తెలిపారు.

ఇంట్లో చలి మంటలు...ఊపిరాడక ఆరుగురి మృతి

న్యూఢిల్లీ: చలి నుంచి ఉపశమనం కోసం వేసుకున్న చలిమంటల కారణంగా ఆరుగురు మరణించారు. దేశ రాజధాని ఢిల్లీలోని రెండు ప్రాంతాల్లో ఈ సంఘటనలు జరిగాయి. ఉత్తర ఢిల్లీలోని ఒక ఇంట్లో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు మరణించినట్లు పోలీసులు గుర్తించారు. ఇంటి డోర్ లోపల నుంచి లాక్ వేసి ఉండటంతో పగులగొట్టి లోనికి వెళ్లి చూశారు. చలిని తట్టుకునేందుకు శనివారం రాత్రి వేళ చలి మంటలు వేసుకోవడంతో పొగ వల్ల ఊపిరాడక ఆ నలుగురు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పశ్చిమ ఢిల్లీలోని ఇంద్రపురి ప్రాంతంలో కూడా ఇదే తరహా ఘటన జరిగింది. నేపాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించారు. వారిని ఆసుపత్రికి తరలించగా అక్కడ మరణించారు. చలిని తట్టుకునేందుకు ఇంట్లో మంటలు రాజేయడంతో పొగ వల్ల ఊపిరాడక వారు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతులు నేపాల్‌కు చెందిన 57 ఏళ్ల రామ్ బహదూర్, 22 ఏళ్ల అభిషేక్‌గా గుర్తించారు. ఈ ఘటనపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం

వాయుసేన అధిపతి వీఆర్ చౌదరి

నాగపూర్: భారత వైమానిక దళం స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం ఇస్తుందని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి అన్నారు. స్వావలంబన కోసం చేస్తున్న ప్రయత్నాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయన్నారు. నాగపూర్‌లోని భోంస్లా మిలిటరీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత రెండుమూడేళ్లలో దేశంలోనే తయారైన పరికరాలు వైమానిక దళం నేతృత్వంలో ప్రతి పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు గుర్తించామని, ఆ తర్వాత అవి ఎయిర్ ఫోర్స్ ఫ్లీట్‌లో చేర్చామని వీఆర్ చౌదరి చెప్పారు. వైమానిక దళం ఎల్లప్పుడూ మరమ్మతు, నిర్వహణ కోసం విదేశీ కంపెనీలపై ఆధారపడుతుందన్నారు. మారుతున్న పరిస్థితుల్లో మరమ్మతు, నిర్వహణ తదితర అనేక విషయాల్లో వైమానిక దళం స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాల్సి ఉంటుందని విశ్వసిస్తోందన్నారు. బేస్ రిపేర్ డిపోపై ఓ ప్రశ్నకు స్పందిస్తూ... వైమానిక దళంలోని అన్ని యూనిట్లకు సహకారం అందించగల కంపెనీలకు తలుపులు తెరిచి ఉన్నాయన్నారు. చెన్నై తీరానికి సమీపంలో బంగాళాఖాతంలో భారత వైమానిక దళానికి చెందిన రవాణా విమానం శిథిలాల గురించిన ప్రశ్నపై ఎయిర్ వీఆర్ చౌదరి మాట్లాడుతూ దురదృష్టవశాత్తు చాలా సమయం పట్టిందన్నారు. వైమానిక దళం కనీసం లోతైన సముద్ర అన్వేషణకు సాంకేతికతను కలిగి ఉందని, శిథిలాలు దొరకడంతో చాలాకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడిందన్నారు.

ఉద్ధవ్ సర్కార్‌ను అందుకే దించాం

మహారాష్ట్ర సీఎం షిండే

ముంబై: మహారాష్ట్రలో అధికార, విపక్షాల మధ్య 'కుటుంబ రాజకీయాలు'పై మాటల యుద్ధం కొనసాగుతోంది. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఎదురుదాడికి దిగారు. 2019 ఎన్నికల్లో తన కుమారుడిని లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దించడాన్ని సమర్థించుకున్నారు. ఆ సమయంలో పార్టీకి ఉన్నత విద్యావంతులు, యువ నేత అవసరం ఉన్నందునే అలా చేయాల్సి వచ్చిందన్నారు. 'ఉన్నత విద్యావంతుడు, యువకుడిని బరిలో దింపాలని 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో పార్టీ భావించింది. అందులో భాగంగా శ్రీకాంత్‌కు పార్టీ టికెట్ ఇచ్చింది. ఆయన విజయం సాధించారు. దాంతో పార్టీ బలం మరింత పెరిగింది. దేశాన్ని ప్రధాని మోదీ అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే... ముఖ్యమంత్రిగా ఉద్ధవ్ ఠాక్రే మహారాష్ట్రను పదేళ్లు వెనక్కి తీసుకెళ్లారు. అందుకే ఆయన ప్రభుత్వాన్ని కూలదోశాం. ఒక్కరి అహాన్ని సంతృప్తి పరచడానికి ఎన్నో అభివృద్ధి ప్రాజెక్టులు నిలిపివేయడం దురదృష్టకరం' అని సీఎం షిండే అన్నారు. ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే ప్రాతినిధ్యం వహిస్తోన్న కల్యాణ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల పర్యటించారు. కుటుంబ రాజకీయాలకు ముగింపు పలకాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. షిండే కుమారుడికి టికెట్టు ఇవ్వడం తప్పిదమని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. దీనికి దీటుగా స్పందించిన ముఖ్యమంత్రి షిండే... ఠాక్రే ఆరోపణలకు ఎటువంటి విలువ లేదన్నారు. ప్రతికూల ఫలితం వచ్చినప్పుడు వ్యవస్థలకు వ్యతిరేకంగా మాట్లాడటం ఠాక్రేకు అలవాటేనని ఎదురుదాడి చేశారు.

అయోధ్యలో హేమమాలిని నృత్య ప్రదర్శన

న్యూఢిల్లీ: అయోధ్య రామాలయం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఓ ప్రత్యేకత చోటుచేసుకోనుంది. బాలీవుడ్ డ్రీమ్‌గాళ్, బీజేపీ నేత హేమమాలిని రామాయణం ఆధారిత నృత్యనాటకం ప్రదర్శించనున్నారు. రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో హేమమాలిని పాల్గొంటున్నట్టు ఆమె కార్యాలయం ఒక వీడియో క్లిప్ విడుదల చేసింది. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు తొలిసారి అయోధ్య వస్తున్నానని, జనవరి 17న అయోధ్య ధామ్‌లో రామాయణం ఆధారిత నృత్య నాటకం ప్రదర్శించనున్నానని ఆ వీడియోలో హేమమాలిని తెలిపారు. దీంతో ఒక్కసారిగా అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. 'ఎప్పటికీ చెక్కుచెదరని అందం' అంటూ ఒకరు ట్వీట్ చేయగా, 'చాలాకాలంగా మీ కోసం ఎదురుచూస్తున్నాం' అని మరో యూజర్ సంతోషం వ్యక్తం చేశారు. హేమమాలిని గత ఏడాది నవంబర్‌లో తన లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన సంత్ కబీర్ 525వ జయంతి కార్యక్రమంలో నృత్య ప్రదర్శన చేశారు. ఇటీవల ముంబైలో జరిగిన ఇరా ఖాన్ నూపుర్ షిఖర వివాహ రెసెప్షన్‌లో అలనాటి నటి రేఖతో కలిసి కనిపించారు. బీజేపీ నుంచి ఆమె 2003లో రాజ్యసభ సభ్యురాలు అయ్యారు. హేమమాలిని భరతనాట్యంలో తనదైన ప్రతిభ చాటుకొంటుండగా, ఆమె కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ ఒడిసీ డాన్సర్లుగా మంచి గుర్తింపు పొందారు. ఖజురహో డాన్స్ ఫెస్టివల్‌లో తల్లీకూతుళ్లు కలిసి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

శవపరీక్ష సహాయకురాలికి అయోధ్య ఆహ్వానం

నర్హర్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధత ఆమెకు గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించిపెట్టాయి. శవపరీక్ష అసిస్టెంట్‌గా వైద్య రంగానికి గణనీయమైన సేవలందించిన 35 ఏళ్ల సంతోషి దుర్గ... అయోధ్యలోని రామమందిరంలో ఈ నెల 22న జరిగే రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. శవపరీక్ష సహాయకురాలైన 35 ఏళ్ల సంతోషి దుర్గ వృత్తి రీత్యా 700కు పైగా పోస్టుమార్టంలు నిర్వహించారు. ఈమెకు రామమందిర్ ట్రస్ట్ ఆహ్వానం పంపింది. ఈ సందర్భంగా సంతోషి దుర్గ ఏఎస్‌ఐతో మాట్లాడారు. నర్హర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యంలో జీవన్ దీప్ కమిటీ కోసం దాదాపు 18 ఏళ్లపాటు పారిశుధ్య కార్మికురాలిగా పనిచేశానని తెలిపారు. ఈ సమయంలో ఆమె 700 పోస్ట్‌మార్టమ్‌లను నిర్వహించారు. ఆమె చేసిన కృషికి వివిధ సంఘాల నుండి గుర్తింపు పొందారు. ట్రస్టు నుంచి ఆహ్వానం అందడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. 'నాకు అయోధ్య నుంచి పిలుపు వస్తుందని ఎన్నడూ అనుకోలేదు, కానీ రాముడు ఆహ్వాన పత్రం పంపి నన్ను పిలిచాడు' అన్నారామె. ఆ లేఖ అందగానే తాను ఆశ్చర్యపోయానని, తన కళ్లలో నుంచి ఆనందంతో కన్నీళ్లు వచ్చాయని వెల్లడించింది. ఆహ్వాన పత్రం పంపినందుకు సంతోషి దుర్గ ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తాను జనవరి 18న నర్హర్‌పూర్ నుండి బయలుదేరి, అయోధ్యలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరవుతానన్నారు. నర్హర్‌పూర్ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థించాలనుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. నర్హర్‌పూర్ బీఎంఓ ప్రశాంత్ కుమార్ సింగ్ కూడా సంతోషిని అభినందించారు. ఆమెకు అయోధ్య నుండి ఆహ్వాన పత్రం అందడం తమకు గర్వకారణమని అన్నారు. పౌర పురస్కార గ్రహీతలు, సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తులు, రామ మందిర ఉద్యమంలో మరణించిన కరసేవకుల కుటుంబ సభ్యులు అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ వేడుక ఆహ్వానితుల్లో ఉన్నారు.

కాలుష్య కోరల్లో ఢిల్లీ

నియంత్రణకు అధికారుల ఆంక్షలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో గాలి కాలుష్యం మళ్లీ తీవ్రస్థాయిలో పెరిగింది. పొగమంచుకు గాలి కాలుష్యం తోడవడంతో పరిస్థితి విషమంగా మారింది. దీంతో కాలుష్యాన్ని నియంత్రించడానికి అధికారులు ఆంక్షలు విధించారు. ఆదివారం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 మార్క్ దాటింది. గాలి నాణ్యతా ప్రమాణాలు తీవ్రమైన ప్రమాదానికి చేరాయి. దేశ రాజధానిలో కాలుష్యం తీవ్రస్థాయిలో పెరగడంతో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ నియంత్రణ చర్యలకు పూనుకుంది. దేశ రాజధాని ప్రాంతంలో అనవసరమైన నిర్మాణ పనులు నిలిపివేశారు. బీఎస్-3, బీఎస్-4 డీజిల్ వాహనాల వాడకాన్ని నిషేధించింది. కాలుష్యం నేపథ్యంలో 5వ తరగతి వరకు తరగతులు నిలిపివేయడంపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర కమిషన్ సూచించింది. శనివారం సాయంత్రం నుండి దేశ రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత అకస్మాత్తుగా క్షీణించింది. దీంతో కాలుష్యాన్ని నియంత్రించడానికి ఢిల్లీ కార్యాచరణ కమిటీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. కాలుష్య నియంత్రణకు ప్రణాళికను అమలు చేయాలని కమిటీ నిర్ణయించింది. ఢిల్లీ పరిసర ప్రాంతంలో తక్షణమే ఈ నిబంధనలు అమలులోకి రానున్నాయని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. రోడ్లు, కాలుష్యం తీవ్రంగా ఉండే ప్రదేశాల్లో నీటిని చిలకరించేలా చూడాలని, ప్రజా రావాణా సేవలు ఎక్కువగా ఉపయోగించుకోవద్దని, వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించాలని, అత్యవసరమైన ప్రాజెక్టులు మినహా.. నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలు తగ్గించాలని సూచించింది. స్టోన్ క్రషర్స్ ఆపరేషన్ మూసివేయాలని,

ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో గనుల తవ్వకాన్ని నిలిపివేయాలని, బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్, ఎల్‌ఎంంతఈలపై కఠినమైన పరిమితులు విధించాలని ఆదేశించింది.

ఒకే భారత్...ఉత్తమ భారత్‌కు ప్రతిబింబం పొంగల్

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఒకే భారతదేశం, ఉత్తమ భారతదేశం అనే స్ఫూర్తిని పొంగల్ పండుగ ప్రతిబింబిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ ఐక్యతా స్ఫూర్తి 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశానికి' బలాన్ని ఇస్తుందని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ నివాసంలో ఆదివారం నిర్వహించిన పొంగల్ వేడుకల్లో మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ పండుగలన్నీ ఏదో ఒక రకంగా వ్యవసాయానికి సంబంధించినవేనన్నారు. 3 కోట్ల మంది రైతులు శ్రీఆన్‌తో అనుబంధం కలిగి ఉన్నారని, దేశంలోని చాలామంది యువత శ్రీఆన్‌తో స్టార్టప్‌లు ప్రారంభిస్తున్నారని ప్రధాని అన్నారు. మిల్లెట్లు తమిళ సంస్కృతితో ముడిపడి ఉన్నాయని గుర్తు చేశారు.దేశ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ అందరి ఇళ్లలో సుఖశాంతులు తీసుకువస్తుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక యువ గాయని పాట పాడుతూ ప్రదర్శన ఇచ్చింది. ఆ తరువాత మోదీ వద్దకు వచ్చి తన పాదాలు తాకి ఆశీర్వాదం తీసుకుంది. ఆ క్రమంలోనే తన పాటతో పరవశించిన ప్రధాని... ఆ చిన్నారిని ఆశీర్వదించి తన శాలువ బహూకరించారు. చిన్నారికి సన్మానం చేశారు. దీంతో చిన్నారి సంతోషంతో ధన్యవాదాలు తెలిపింది. అయితే ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా... వైరల్ అవుతోంది. మోదీ దక్షిణ భారతానికి చెందిన సంప్రదాయ పంచెకట్టుతో ఆకట్టుకున్నారు. వీడియోలో మోదీ నల్లకోటుతో, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నారు. ఎడమ భుజంపై శాలువా వేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మోదీ ధోతీలో రావడం విశేషం. ఆ క్రమంలో గోవుకు పూజలు చేశారు.

స్కూల్ పిల్లలతో ఇంటి పనులు చేయిస్తున్న ప్రిన్సిపాల్

బెంగళూరు: కర్నాటకలోని కలబురిగిలో ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ ఇంట్లో విద్యార్థులు మరుగుదొడ్లు శుభ్రం చేయడం, ఇంటి పనులు చక్కబెడుతున్న ఘటన వెలుగుచూసింది. ఏడాది కాలంగా చిన్నారులతో ప్రిన్సిపాల్ తన ఇంట్లో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మైనారిటీస్ డైరెక్టరేట్ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మౌలానా ఆజాద్ మోడల్ స్కూల్స్‌లోని ఓ పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఓ బాలుడి తండ్రి మహ్మద్ జమీర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన బయటకువచ్చింది. ఈ విషయమై విద్యార్థుల తల్లితండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీయగా పారిశుద్ధ్య విభాగంలో తగినంత సిబ్బంది లేదని ఆమె దురుసుగా బదులిచ్చినట్లు ఫిర్యాదులో జమీర్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు అనంతరం తగిన చర్యలు చేపడతామని పోలీసులు వెల్లడించారు.

2004 చరిత్ర పునరావృతం

- కాంగ్రెస్ బలోపేతానికే భారత్ జోడో యాత్ర
- బీజేపీ వాదనలు తోసిపుచ్చుతూ జైరాం రమేశ్



ఇంఫాల్ : 2024 ఎన్నికల ఫలితాలు ముందుగానే ముగిశాయంటూ బీజేపీ చేస్తున్న వాదనలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తోసిపుచ్చారు. 'టైగర్ జిందా హై'... ప్రతిపక్ష కూటమి 2004 చరిత్రను పునరావృతం చేస్తుందని, కాషాయ పార్టీ 'మెరిసిపోతున్న భారతదేశం' ప్రచారం ఉన్నప్పటికీ ఆ పార్టీని అధికారం నుంచి తప్పించిందని అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ బలమైన కాంగ్రెస్ మాత్రమే బలమైన ప్రతిపక్షాన్ని నిర్ధారిస్తుందని, 'భారత్ జోడో న్యాయ యాత్ర' పార్టీని బలోపేతం చేసే ప్రయత్నమని నొక్కి చెప్పారు. తూర్పు నుంచి పడమర యాత్రను నిర్వహించేటప్పుడు పార్టీ ఎన్నికల సన్నాహాలను ఎలా నిర్వహిస్తుందనే దానిపై జైరాం రమేశ్ మాట్లాడుతూ ఒక పార్టీ సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందని, రాహుల్ గాంధీ యాత్రలో నిమగ్నమై ఉన్నప్పటికీ ప్రచారంలో భాగమవుతారని తెలిపారు. 'ఎన్నికలు ప్రారంభమయ్యే సమయానికి యాత్ర ముగుస్తుంది. ఎన్నికలు ఎక్కడో ఒకచోట ప్రారంభమవుతాయని నేను ఆశిస్తున్నాను. బహుశా ఏప్రిల్ మొదటి వారంలో యాత్ర ముగియవచ్చు. సమావేశాలను ఎల్లప్పుడూ జూమ్‌లో నిర్వహించవచ్చు. నేను దానిని సమస్యగా చూడటం లేదు' అని అన్నారు. రాహుల్ గాంధీ మణిపూర్ నుంచి ముంబై వరకు చేపట్టిన 6,700 కి.మీ యాత్ర కారణంగా ఎన్నికల సన్నాహాలకు ఆటంకం కలుగుతుందనే ఆందోళనలను తోసిపుచ్చారు. 2024 ఎన్నికల ఫలితాలు ముందస్తుగా ముగిశాయన్న వారికి ఏమి చెబుతారని బీజేపీ కథనం గురించి అడిగినప్పుడు, సీనియర్ కాంగ్రెస్ నేత స్పందిస్తూ, ప్రముఖ హిందీ సినిమా టైటిల్ నుంచి అరువు తీసుకుంటూ, 'టైగర్ జిందా హై' అది నా నిరంతర పల్లవి' అని చమత్కరించారు. 2024లో ప్రధాని నరేంద్ర మోదీకి మూడోసారి అధికారం ఖాయమని చాలా మంది బీజేపీ నేతలు నొక్కి చెప్పారని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) ఆశ్చర్యాన్ని కలిగించగలదని మీరు నమ్ముతారా అని ప్రశ్నించగా, 2003లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లో ఓడిపోయాం. ప్రజలు కాంగ్రెస్‌కు రాసిపెట్టారు. కానీ 2004లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో 'భారతదేశం వెలిగిపోతోంది' అనే ప్రచారం ఉంది. 'చరిత్ర పునరావృతమవుతుంది' అని శనివారం సాయంత్రం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'అమృత్‌కాల్' కల కంటే గత పదేళ్లలో 'అన్యాయం' (అన్యాయ కాలం)తో ప్రజలు ఎక్కువగా కదిలిపోతున్నారని ఆయన అన్నారు. 'అమృత్ కాల్ ఒక కల, అన్యాయ్ కాల్ ఒక పీడకల' అని తెలిపారు. 2004లో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. అయితే అతల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధిక ప్రచారం 'షైనింగ్ ఇండియా' ప్రచారం ఉన్నప్పటికీ ఎన్నికలలో ఓడిపోయింది. ఈ యాత్ర కాంగ్రెస్ పార్టీతో విపక్ష ఐక్యతను బలపరుస్తుందా లేదా అనే దానిపై జైరాం రమేశ్ మాట్లాడుతూ 'బలహీనమైన కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షాన్ని నిర్ధారించదు. బలమైన కాంగ్రెస్ మాత్రమే బలమైన ప్రతిపక్షానికి భరోసా ఇవ్వగలదు. ఈ 'భారత్ జోడో న్యాయ యాత్ర' కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికేనని' అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర తర్వాత తదుపరి యాత్ర ఆవశ్యకత గురించి మాట్లాడుతూ మణిపూర్ నుంచి జరిగే యాత్ర భారత్ జోడో యాత్రకు కొనసాగింపు అని తెలిపారు. ఇది రాజ్యాంగంలోని మొదటి పంక్తి నుంచి ఉద్భవించిందని, భారతదేశ ప్రజలందరికీ న్యాయం జరిగేలా హామీ ఇస్తుందని అన్నారు. 'పీఠికకు నాలుగు స్తంభాలు ఉన్నాయి : న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. ఇప్పుడు యాత్రలో ఎక్కువ భాగం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో ముడిపడి ఉంది. కానీ ఇప్పుడు మేము పీఠికలోని మొదటి పంక్తిలో పేర్కొన్న మొదటి స్తంభం... న్యాయం, ఆర్థిక, సామాజిక, రాజకీయంపై దృష్టి సారించడం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. 'అందువల్ల ఈ యాత్ర ప్రధాన దృష్టి గత పదేళ్లలో 'అమృత్ కాల్' కాకుండా 'అన్యాయ్ కాల్' అని ప్రత్యేకంగా ప్రస్తావించడంపై దృష్టి సారించి భారత్ జోడో యాత్రను ముందుకు తీసుకెళ్లడం' అని అన్నారు. 'మేము భారత్ జోడో యాత్ర ఫలితాలను చూశాము. కర్నాటక లేదా తెలంగాణలో ఏమి జరిగిందో దాని ద్వారా నేను ఫలితాలను అంచనా వేయడం లేదు. నేను ఒకసారి వివరించినట్లుగా, అది రాహుల్ గాంధీకి మెరుగైన అనుసంధానతను, సంస్థకు మెరుగైన సామూహికతను తీసుకువచ్చింది' అని తెలిపారు. అందువల్ల ఈ అనుసంధానత, సామూహికత సంస్థకు చాలా ముఖ్యమైనదన్నారు. 'ఈ (యాత్ర) ఎన్నికల ప్రభావాన్ని చూపుతుందా లేదా అనేది నా ప్రాథమిక ఆందోళన కాదు. ఇది ఓ రాజకీయ పార్టీ చేస్తున్న యాత్ర. ఇది సైద్ధాంతిక యాత్రే తప్ప ఎన్నికల యాత్ర కాదు' అని ఆయన స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలుస్తుందనే దానిపై యాత్రను అంచనా వేయబోనని జైరాం రమేశ్ అన్నారు. 'ఈ యాత్రలో రాహుల్ గాంధీ చేస్తున్నది ప్రాథమికంగా కాంగ్రెస్ సైద్ధాంతిక సందేశాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు జరిగిన వివిధ అన్యాయాలను ఎత్తి చూపుతున్నారు. అలాగే, రాబోయే 66 రోజులలో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని నిర్ధారించే నిర్దిష్ట ఎజెండాను కాంగ్రెస్, ఆయన చూస్తున్నది ఏమిటో వివరించడం' అని తెలిపారు. ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం, ఏకవ్యక్తి పాలన నుంచి దేశాన్ని విముక్తి చేయడం, మహిళలు, రైతులు, యువతకు ఏ విధంగా అన్యాయం జరిగిందో ఎత్తిచూపేందుకు కూడా ఈ యాత్ర సాగుతుందని ఆయన అన్నారు.

సీట్లు గల్లంతే!

- సంక్రాంతి తర్వాత వైసీపీ నాలుగో జాబితా
- కొత్త ముఖాలకు జగన్ ప్రాధాన్యత
- అసంతృప్త నేతలకు బుజ్జగింపులు
- తలనొప్పిగా మారిన బాలినేని



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతి తర్వాత నాలుగో విడత జాబితాను విడుదల చేసేందుకు వైసీపీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఈనెల 17 లేదా 18న జాబితాను ప్రకటించేందుకు వైసీపీ అధినేత, సీఎం జగన్ సిద్ధమయ్యారు. ఈలోగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పులు, చేర్పులపై సంప్రదింపులు చేపడుతున్నారు. తదుపరి జాబితాలో అత్యధికంగా ఎంపీ అభ్యర్థులు ఉంటారు. వాటితోపాటు 8 నుంచి 10 అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌లకు మార్పులు, చేర్పులు ఉంటాయి. ఈ క్రమంలో కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు గల్లంతవుతాయి. ఎంపీలను ముగ్గురు మినహా మిగిలిన వారందరినీ మార్చేందుకు నిర్ణయించారు. ఇప్పటికే రెండు, మూడు జాబితాల్లో 9 మందిని లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌లుగా ప్రకటించారు. ఎంపీ, ఎమ్మెల్యేల జాబితాల్లో కొత్తవారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం, గుంటూరు, నరసారావుపేట, ఒంగోలు, నంద్యాల ఎంపీల సీట్లపై స్పష్టత రానుంది. కాకినాడ ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టిని బరిలో దించాలని వైసీపీ అధిష్ఠానం ఆలోచిస్తుండగా, ఆయన నిరాకరిస్తున్నారు. రాజమండ్రి ఎంపీగా కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్ పేరు దాదాపు ఖరారైంది. నంద్యాల ఎంపీ అభ్యర్థిగా సినీ నటుడు అలీ పేరును ప్రకటించే అవకాశాలున్నాయి. ఆయా అభ్యర్థులతో వరుస వారీగా వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, ముఖ్యనేతలు సంప్రదింపులు చేపట్టి, పోటీపై ఒక స్పష్టతకు వస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మార్పులు, చేర్పులు ఉంటాయి. ఇప్పటికే మూడు విడతలుగా 50 అసెంబ్లీ స్థానాల్లో మార్పులు చేపట్టారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను యలమంచిలి లేదా మరో నియోజకవర్గానికి మార్చనున్నారు. ఎక్కడా ఇన్‌ఛార్జ్‌లు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వైసీపీ సీనియర్ నేతలు బుజ్జగిస్తున్నారు. తాజాగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు అధిష్ఠానం సర్దిచెప్పగా, ఆయన అలక వీడినట్లు తెలిసింది.

వైసీపీ శ్రేణుల్లో అయోమయం

వైసీపీ నుంచి ఒక్కొక్కరు వీడిపోతుండటంతో ఆ పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల కర్నూలు, మచిలీపట్నం సిట్టింగ్ ఎంపీలు ఆ పార్టీకి రాజీనామా చేసి షాక్ ఇచ్చారు. వైసీపీ విజయవాడ నగర అధ్యక్షులు బొప్పన భవకుమార్ ఇదే బాటలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, వారి అనుచరులు అధిష్ఠానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి వ్యవహారం వైసీపీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఒంగోలు ఎంపీని మాగుంట శ్రీనివాస్‌రెడ్డికి ఇస్తేనే, తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటూ ఆయన షరతు విధించారు. ఇప్పటికే మూడు విడతలుగా క్యాంపు కార్యాలయానికి వచ్చి ఆయన జగన్‌తో చర్చించారు. ఒంగోలు ఎంపీని ఈ విడత మాగుంట శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వబోమని సీఎం స్పష్టత చేయడంతో బాలినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మూడు రోజులుగా ఆయన హైదరాబాద్‌కు మకాం మార్చి, అందుబాటులో లేకుండా ఉండిపోయారు. ఇప్పటికే ఎంపీ మాగుంటను ఎమ్మెల్యేలు కరణం బలరామ్, సుధాకర్‌బాబు కలవడం చర్చనీయాంశంగా మారింది. బాలినేని పార్టీ వీడితో ప్రకాశం జిల్లాలో వైసీపీకి పెద్ద నష్టం కలిగే అవకాశం ఉంది. దీంతో బాలినేనితో వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఫోన్ ద్వారా చర్చలు జరుపుతున్నారు. సీఎం జగన్‌ను ఆయన కలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగో విడత జాబితా విడుదల అనంతరం సీఎం ప్రాంతీయ సమావేశాలతో భేటీలకు సిద్ధమయ్యారు. ఉత్తరాంధ్ర నుంచి ఇవి ప్రారంభం కానున్నాయి. ఐదారు జిల్లాల నేతలతో ఆయన ముఖాముఖీగా వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేస్తారు. అనంతరం నేతలతో నేరుగా మాట్లాడతారు. టికెట్లు దక్కని వారికి ప్రత్యామ్నాయ అవకాశాలపై హామీ ఇస్తారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

పరుచూరి రాజేంద్రబాబు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి 62 నుండి 58 సంవత్సరాలకు తగ్గించాలని, మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలనీ,ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలోని విద్యార్థులు యువకులు నిరుద్యోగులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని రాజేంద్ర బాబు హెచ్చరించారు.

ఏఐవైఎఫ్ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో దాసరి భవన్ వద్ద ఆదివారం భోగి మంటలలో జాబ్ క్యాలెండర్ ప్రకటనలు, మంత్రుల పేపర్ ప్రకటనల ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో 2,35,794 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న సీఎం జగన్... నేటికీ ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రొబిషన్ పూర్తయినా ... వారికి పే స్కేల్ ప్రకటించకుండా మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఖాళీ పోస్టులు ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 50,667 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎస్జీటీలతో అదనపు తరగతులు నిర్వహిస్తూ డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేయడంతో పాటు జాతీయ విద్యా విధానం పేరుతో అనేక ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదంటూ మంత్రులు వెల్లడించడం సరికాదన్నారు. నిరుద్యోగ యువత వేలాది రూపాయల ఖర్చు పెట్టుకుని డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తోందని, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఎన్నికల్లో నిరుద్యోగ యువతను మరోసారి మోసం చేసేందుకే సంక్రాంతి తర్వాత డీఎస్సీ ఇస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటనలు ఇస్తున్నారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యంగా విద్య,వైద్య, ఆర్థిక శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి లంకా గోవింద రాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, నగర సహాయ కార్యదర్శి శింగం శెట్టి మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ యాత్రలో డానిష్

ఇంఫాల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రలో భాగస్వామినవుతానని బీఎస్పీ సస్పెండ్ చేసిన లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీ ఆదివారం ప్రకటించారు. ఐక్యత, న్యాయం కోసం జరుగుతున్న అతిపెద్ద కార్యక్రమంలో చేరకపోతే రాజకీయ నాయకుడిగా తన విధి నిర్వహణలో విఫలమవుతానని ఆయన తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) గత నెలలో అలీని సస్పెండ్ చేసింది. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ, పాలక ఎన్డీఏ కూటమి, ప్రతిపక్ష ఇండియా కూటమికి దూరంగా ఉంటున్నప్పటికీ బీజేపీ, ఆ పార్టీ విధానాలపై అలా ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తూ చురుగ్గా ఉన్నారు. ఆదివారం ఆయన 'ఎక్స్'లో స్పందిస్తూ... ఇంఫాల్‌లో దిగిన తర్వాత భారత్ జోడో న్యాయ్ యాత్రలో చేరాలని నిర్ణయించుకు న్నట్లు ప్రకటించారు. 'ఇది నాకు చాలా ముఖ్యమైన క్షణం. చాలా ఆత్మ పరిశీలన తర్వాత ఇక్కడికి వచ్చాను. నాకు రెండు ఎంపికలు ఉన్నాయి - యథాతథ స్థితిని అంగీకరించడం అంటే... దళితులు, వెనుకబడినవారు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర అట్టడుగు, పేద వర్గాల దోపిడీని విస్మరించడం లేదా దేశంలో భయం, ద్వేషం, దోపిడీ తీవ్రతరం అవుతున్న ఈ వాతావరణానికి వ్యతిరేకంగా సంపూర్ణ ప్రచారాన్ని ప్రారంభించడం' అని ఆయన అన్నారు. 'నా మనస్సాక్షి నన్ను రెండవ ఆప్షన్ తీసుకోవడానికి పురికొల్పింది' అని తెలిపారు. రాహుల్ చేపట్టిన ఈ యాత్ర విభజన శక్తులపై చర్యకు పిలుపు. ఈ యాత్ర భయం, ద్వేషం, దోపిడీ ,విభజనకు వ్యతిరేకంగా దేశ ప్రజలను ఏకం చేయడానికి ఒక డ్రైవ్ అని అలీ తెలిపారు. 'నేను ఐక్యత, న్యాయం కోసం అతిపెద్ద డ్రైవ్‌లో చేరకపోతే రాజకీయ నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా నా విధి నిర్వహణలో విఫలమవుతానని భావిస్తున్నందున నేను ఈ యాత్రలో అతనితో చేరాలని నిర్ణయించుకున్నాను' అలీ పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం జోడో న్యాయ యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

భారత సైన్యం ఉపసంహరణకు

మార్చి 15 డెడ్‌లైన్

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

మాలె: భారత్‌తో దౌత్యపరమైన విభేదాలు కొనసాగుతున్న వేళ మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు మరో కీలక ఆదేశాన్ని జారీచేశారు. తమ దేశంలో భారత్ దళాలు ఉండేందుకు వీల్లేదని తేల్చిచెప్పారు. మార్చి 15లోగా మీ దళాలను ఉపసంహరించుకోండి అంటూ భారత్‌కు స్పష్టంచేశారు. మాల్దీవుల ప్రభుత్వ తాజా గణాంకాల మేరకు మాల్దీవుల్లో 88 భారత సైనికులు ఉన్నారు. ప్రభుత్వ సీనియర్ అధికారి అబ్దుల్లా నజీం ఇబ్రహీం విలేకరులతో మాట్లాడుతూ సైన్యాన్ని ఉపసంహరించేందుకు మార్చి 15 వరకు భారత్‌కు గడువు ఇచ్చినట్లు తెలిపారు. భారత సైన్యం మాల్దీవుల్లో ఉండేందుకు వీల్లేదన్నది ముయిజ్జు, ఆయన ప్రభుత్వ విధానమన్నారు. ఆదివారం ఉదయం మాలెలోని విదేశాంగ శాఖ కేంద్ర కార్యాలయంలో భారత్, మాల్దీవుల ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందాలు తొలిసారి భేటీ అయి సైనిక ఉపసంహరణపై నిశితంగా చర్చించాయి. భారత హై కమిషనర్ మను మహావర్ పాల్గొన్నారు. మార్చి 15 నాటికి సైన్యం ఉపసంహరణే ఈ సమావేశం అజెండాగా నజీం తెలిపారు. మాల్దీవుల అధ్యక్షుడిగా గతేడాది నవంబరు 17న ప్రమాణ స్వీకారం చేసిన ముయిజ్జు... భారత దేశానికి సైన్యాన్ని ఉపసంహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల చైనాలో పర్యటించిన ముయిజ్జు శనివారం స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడిన భారత్‌పై విమర్శలు చేశారు. మాది చిన్న దేశమే అయినప్పటికీ... వేధిస్తే ఊరుకునేది లేదని అన్నారు. మాది స్వతంత్ర దేశం, సార్వభౌమత్వంగల రాజ్యం, ఎవరి పెరట్లో ఉండటం లేదు అని వ్యాఖ్యానించారు. తమ దేశ వ్యవహారాల్లో తలదూర్చేందుకు, తమపై ఒత్తిడి తెచ్చేందుకు ఏ దేశానికి హక్కు లేదని ముయిజ్జు తేల్చిచెప్పారు. ఇదిలావుంటే, గత ప్రభుత్వ హయాంలో భారత్‌తో జరిగిన 100కుపైగా ద్వైపాక్షిక ఒప్పందాలను మాల్దీవుల ప్రభుత్వం పున:పరిశీలిస్తోందని సమాచారం.

కాంగ్రెస్ సీనియర్ నేత ముస్తఫా కన్నుమూత

కొచ్చి: కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టీహెచ్ ముస్తఫా (82) కన్ను మూశారు. ఆయనకు భార్య, ఎనిమిది మంది సంతానం ఉన్నారు. ఐదుసార్లు కేరళ శాసనసభకు ఎన్నికైన ముస్తఫా... కరుణాకరన్ మంత్రివర్గంలో ఆహార మంత్రిగా పని చేశారు. వయసు రీత్యా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 5.43 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ముస్తఫా మృతికి పార్టీలకతీతంగా నేతలు సంతాపం తెలిపారు. ముస్తఫా మంత్రిగా, శాసనసభ్యుడిగా, కాంగ్రెస్ నాయకుడిగా కేరళ ప్రజా జీవితంలో తనదైన ముద్ర వేశారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కొనియాడారు. ఎర్నాకులం జిల్లాలో ముస్తఫా కాంగ్రెస్‌ను బలోపేతం చేసి, పురోగమింపజేశారని రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ పేర్కొన్నారు. ముస్తఫా మృతి పార్టీకి తీరని లోటు అని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడు కే సుధాకరన్ పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఆయన గొప్ప వక్త , నిర్వాహకుడు... రాజకీయాలకు అతీతంగా తనను సంప్రదించిన వారికి సహాయం చేసేవారు' అన్నారు. టీహెచ్ ముస్తఫా మృతితో కాంగ్రెస్ బలమైన నేతను కోల్పోయిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీకి మెజారిటీ రాదు: శశిథరూర్

కొయ్‌కోడ్ (కేరళ): సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చే అవకాశం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. అతిపెద్ద పార్టీగా అవతరించినాగానీ మెజారిటీ మార్కు సాధించేందుకు బహుశ దాని భాగస్వామ్యపక్షాలు మద్దతు ఇవ్వకపోవచ్చన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఎన్డీయే మిత్రపక్షాలు ఈసారి ఇండియా కూటమికి మద్దతు ఇస్తాయని శశిథరూర్ విశ్వాసం వ్యక్తంచేశారు. కేరళలో జరిగిన ఒక కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ బీజేపీతో కలిసి ఉండటానికి ఎన్డీయే పార్టీలన్నీ ఒప్పుకోకపోవచ్చు. ఇది ఇండియాకు లాభదాయకంగా పరిణమించవచ్చు అని అన్నారు. ఇండియా కూటమి సీట్ల సర్దుబాటు గురించీ మాట్లాడుతూ చర్చలు త్వరలోనే కొలిక్కి వస్తాయని ఆకాంక్షించారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా పరిస్థితులు ఉన్నాయని, కొన్ని చోట్ల అనుకూలంగా మరికొన్ని చోట్ల కాస్త ప్రతికూలంగా ఉన్నట్లు తెలిపారు. కేరళలో ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్, సీపీఎం మధ్య సీట్ల సర్దుబాటు ఊహించలేనిదని శశిథరూర్ అన్నారు. అదే తమిళనాడులో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, డీఎంకే కలిసి పోటీ చేసేందుకు ఇబ్బంది లేదన్నారు. గతంలోనూ కలిసి పోటీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని, అభ్యర్థిని చూసి ఓటు వేయాలే తప్ప గుడ్డిగా వ్యవహరించవద్దని ప్రజలకు ఆయన సూచించారు. 'మోదీ నామాన్ని జపించేవారిని కాదు సమర్థ నాయకులను ఎన్నుకోండని హితవు పలికారు. చట్టసభల్లో ప్రజా వాణిని వినిపించే వారిని ఎన్నుకోవాలని ప్రజలను శశిథరూర్ కోరారు.

తమిళనాట రెక్లా రేసుల సందడి

చెన్నై: భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో తమిళనాడులో రెక్లా రేసు నిర్వహించడం ఆనవాయితీ. ఇది ఆ రాష్ట్ర సాంప్రదాయ క్రీడ. వందల ఏళ్లుగా పొంగల్ సందర్భంగా మూడు రోజుల పాటు వీటిని నిర్వహిస్తుస్తారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా రెక్లా రేసులు పెద్దఎత్తున జరిగాయి. ఎద్దుల బండ్లు కాకుండా తేలికగా ఉండే చక్రాల బండ్లను ఈ రేసుల్లో వాడతారు. ఈ బండ్లనే రెక్లాలు అంటారు. ఒక ఎద్దు బండ్లతోగానీ, రెండు ఎద్దుల బండ్లతోగానీ రేసు నిర్వహిస్తారు. విజేతలకు జల్లికట్టు మాదిరిగా బహుమతులు ఇస్తారు.

పనిచేయని ప్రధానిని ప్రశ్నిస్తే తప్పా: ప్రకాశ్ రాజ్

చెన్నై: ప్రధాని మోదీ అంటే తనకు ద్వేషం లేదని, సరిగ్గా పనిచేయకపోతే దేశ పౌరుడిగా ప్రశ్నించే అధికారం తనకు ఉంటుందని సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. 'నేను మోదీని ద్వేషించడం లేదు. ఆయన నాకేమైనా మామనా.. లేక ఆయనతో ఆస్తి సమస్య ఉందా? ఆయనను ఎందుకు ద్వేషించాలి. నేను పన్ను చెల్లింపుదారుడిని. ఆయన పని చేస్తున్నందుకు వేతనం ఇస్తున్నాం. ఆయన తన పనిని సక్రమంగా చేయడం లేదు. నేను అదే చెబుతున్నా' అని చెప్పారు. కేరళ సాహిత్య ఉత్సవంలో పాల్గొన్న సందర్భంగా ప్రకాశ్‌రాజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలతో తమ పార్టీ తరపున పోటీ చేయాలని తనను మూడు పార్టీలు సంప్రదించినట్లు తెలిపారు. అయితే ఆ ఉచ్చులో చిక్కుకోబోనన్నారు. ఆయా పార్టీల వారు తనను ఇబ్బంది పెట్టకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశానని చెప్పారు. నేడున్న పార్టీలు తమ గొంతును కోల్పోయాయి. కాబట్టి అభ్యర్థులు దొరక్క ఇబ్బంది పడుతున్నాయని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని 'ఎక్స్'లో విమర్శించడంపై స్పందిస్తూ అందరి మనసులో మాటలనే కదా బయట పెట్టాను. అదేమీ నా ఒక్కరి వాణి కాదు అని చెప్పారు. ఇది నా 'మన్ కీ బాత్' కాదు.. మా 'మన్ కీ బాత్' అని చమత్కరించారు. అధికారంలో ఉన్న వ్యక్తిని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. మోదీకి తాను ఓటు వేయకున్నా.. దేశ పౌరుడిగా తనకు మోదీయే ప్రధాని అని అన్నారు. 'ప్రధాని మోదీ వెళ్లిపోతే ఆయన గురించి నేనుందుకు మాట్లాడుతాను... తదుపరి ఎవరు వస్తే... వారి చేసే పనిని బట్టి ప్రశ్నిస్తా' అని ప్రకాశ్ రాజ్ తెలిపారు.

మాంజా దారం మెడకు చుట్టుకొని

సైనికుడి మృతి

హైదరాబాద్: హైదరాబాద్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. మాంజాదారం మెడకు చుట్టుకొని తీవ్ర గాయాలతో సైనికుడు ప్రాణాలను విడిచాడు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నంకు చెందిన సైన్యంలో సేవలందిస్తున్న కోటేశ్వరరావు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకొని ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో లంగర్‌హౌస్‌పై వద్ద మెడకు మాంజా చుట్టుకున్నది. దీంతో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయను ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలకు గురైన ఆయన పరిస్థితి విషమించ డంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే అల్వాల్‌లో పంతగులు ఎగుర వేస్తున్న యువకుడు భవనంపై నుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడిని పేట్ బషీర్‌భాగ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ తనయుడు ఆకాశ్‌గా గుర్తించారు. చైనా మాంజాపై నిషేధం ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా పలువురు విక్రయిస్తున్నారు. పతంగులను ఎగురవేస్తూ ఇష్టారాజ్యంగా వదిలి వేస్తుండడంతో మాంజాదారం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, పక్షులు సైతం బలవుతున్నాయి.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.